

# అధిక ధరలతో.. రైతు గుండెల్లో.. దడ

## పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు



ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త, పశ్చిమాసియాలో జరిగిన యుద్ధం మొన్న మన వంటింట్లో కాక పుట్టించగా నిన్న పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నింటి మధ్యతరగతి నడ్డివిరియగా నేడు పెరిగిన ఎరువులు ధరలతో రైతు కుదేలవుతున్నాడు. ఎక్కడో యుద్ధం జరిగితే మనకెందుకులే అని హాయిగా ఉన్న ప్రజలు ప్రస్తుతం ఆ యుద్ధం కారణంగా పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్నాడు.. ఒక రంగమే కాక అన్ని రంగాలపై యుద్ధ ప్రభావం ఉంటుందనే విషయాన్ని ప్రజలు

2వ పేజీలో...

**ఖరీఫ్ సీజన్ కు ముందే రైతు నడ్డి విరిచిన ప్రభుత్వం**

**ఖరీఫ్ ఆలస్యం అవుతుందోనని రైతులు ఆవేదన**

**మృగశిర దాటినా చినుకు పడని వైనం**

**ఆకాశాన్నంటుతున్న నిత్యవసర ధరలు**

**రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు**

**మధ్యతరగతిపై పెను భారం**

ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



వార్త

శుక్రవారం 12, జూన్ 2026 16 పేజీలు




# ఖమ్మంలో.. భారీ చోరీ.!

ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్త

ఖమ్మం నగరంలో గురువారం తెల్లవారుజామున భారీ చోరీ ఘటన జరిగింది. నగరంలోని ప్రధాన మార్గమైన వైరా రోడ్ లో గల సోనో విజన్ షాపులో దుండగులు ప్రవేశించి విలువైన సెల్ ఫోన్లను, ఇతర సొత్తును దొంగలించారు. దోపిడీకి గురైన సొత్తు విలువ సుమారు రూ. 60 లక్షల వరకు ఉంటుందని నగర ఏసీపీ రమణమూర్తి 2లో...

**సోనోవిజన్‌లో ఐఫోన్లు లూటీ చేసిన దొంగలు.**

**అలారం మోగడంతో అప్రమత్తమైన షోరూం నిర్వాహకులు**

**సిబ్బంది షోరూమ్‌కు చేరుకునే లోపే కారులో పరారైన నిందితులు**

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సిపి సునీల్ దత్**

**నిందితుల కోసం గాలింపు**












## అధిక ధరలతో రైతు గుండె దడ

మొదటి పేజీ తరువాయి..

ఆలస్యంగా తెలుసుకుంటున్నారు... ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు పెరగగా పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ఈ ధరలను నియంత్రించాల్సిన కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నందున ఆ భారాన్ని ప్రజలు మోయక తప్పడం లేదు... మరోవైపు కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచింది.. మరో కొన్ని రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే రైతులు దుక్కులు దున్ని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.. అక్కడక్కడ వర్షం కురుస్తున్న ప్పటికీ రైతులు ఆశించిన స్థాయిలో వరుణ దేవుడు కనికరించడం లేదు. . ఫలితంగా ఖరీఫ్ సీజన్ ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు తొందరపడి ఎలాంటి విత్తనాలు నాటవద్దని, ఈనెల 20వ తేదీ వరకు వేచి ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.. ప్రభుత్వం నుండి అందాల్సిన పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు వర్షం కురవక ఆకాశం వైపు తలెత్తి దీనంగా చూస్తున్నాడు రైతు ఈ పరిస్థితుల్లో కాంప్లెక్స్ ఎరువుల ధరలు కూడా పెరగడంతో రైతులు ఎలా వ్యవసాయం చేయాలని దిగులు చెందుతున్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసర ధరలు, రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలతో పేద మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచి రైతు నడ్డి విరిచారు. పండించే పంటకు గిట్టుబాటు ధరలు లేక ఏడాదికి ఏడాది రైతుల అప్పులు కుప్పలుగా పెరుగుతున్నాయి తప్ప రైతు ఆశించిన స్థాయిలో ధరలు మాత్రం ఉండటం లేదు.. రైతు పండించే పంటలకు ధరలను పెంచని పాలకులు, రైతులకు అవసరమయ్యే ఎరువుల ధరలను మాత్రం పెంచడం ఏమిటని పలు రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు... పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు......రైతులు వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలను విపరీతంగా పెంచడంతో అన్నదాత అయోమయంలో పడ్డారు. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తత ల నేపథ్యంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలపై ప్రభావం చూపింది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు 100 రూపాయల నుంచి 500 రూపాయల వరకు పెంచారు. ముడి పదార్థాల ధరలు, రవాణా ఖర్చులు పెరగడంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు కూడా పెంచినట్లు ఎరువుల కంపెనీలు పేర్కొంటున్నాయి. యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడి పదార్థాల ధరలు పెరిగాయి. దీంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచక తప్పలేదని ఎరువుల కంపెనీలు పేర్కొంటున్నాయి. పంటల సాగు ప్రారంభంలోనే కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. యూరియా, డి ఏ పి ఎరువుల ధరలు మాత్రం ఎరువుల కంపెనీలు పెంచలేదు. దీంతో కొంతమేరకు రైతులకు ఉపశమనం కలిగింది. దేశంలో పొస్పేట్, పొటాషిక్ ఎరువుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలు ఎక్కువ భాగం దిగుమతి చేసుకుంటారు. యుద్ధం కారణంగా ధరలు పెంచక తప్పలేదు. ఎరువుల వ్యాపారస్తులు, వ్యవసాయ శాఖ సమాచారం మేరకు 20:20:13,10:26:26, 17:17:17 కాంప్లెక్స్ ఎరువుల ధరలను బస్తాకు 100 నుంచి 500 రూపాయల వరకు పెంచారు. 20:20:13 ఎరువు 50 కేజీల బస్తా ఇంతకుముందు 1600 రూపాయలు ఉండగా ప్రస్తుతం 1,800 నుంచి 2,100 రూపాయలకు పెంచారు. 10:26:26 ఎరువు 50 కేజీల బస్తా పాత ధర 1,850 రూపాయలు ఉండగా ప్రస్తుతం 1,950 నుంచి 2,250 రూపాయలకు పెంచారు. 17:17:17 ఎరువు 50 కేజీల బస్తా పాత ధర 1,700 రూపాయలు ఉండగా 1,900 నుంచి 2,150 రూపాయలకు పెంచారు. యూరియా 266.50 లకు, డి ఏ పి 1,350 రూపాయలకు ఇస్తున్నారు. యూరియా, డిఏపి ధరల్లో ఎలాంటి పెంపుదలలేదు. పాత ధరలే అమలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వానాకాలం పంటల సాగు ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఏ ఏ ఏ పంటలు ఎన్ని ఎకరాలలో సాగు చేస్తారు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం సీజన్లో లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారు. ఒక్కొక్క ఎకరానికి మూడు బస్తాల కాంప్లెక్స్ ఎరువులు వాడితే పెంచిన ధరల ప్రకారం రైతులపై 1500 రూపాయల భారం పడుతుంది. దీంతో పెట్టుబడి కూడా పెరుగుతుంది. పంటల సాగు తో పాటు కూరగాయల తోటల సాగుకు కూడా కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారు. దీంతో కూరగాయల తోటల సాగు చేసే రైతులపై కూడా అదనపు పెట్టుబడి భారం పడనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం రైతులకుభారంగా పరిణమించింది. ప్రతి సంవత్సరం పంట చేతికి వచ్చే సమయానికి ఏదో ఒక ప్రతిభందకం ఏర్పడి రైతులు నష్టపోతున్నారు. వ

### పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలి...

**కుర్ర వెంకన్న (అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి)**



రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు పెరగవు, కానీ రైతులు వినియోగించే కాంప్లెక్స్ ఎరువుల ధరలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒకవైపు పెరుగుతున్న నిత్యవసర ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల వలన పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని నరేంద్ర మోడీ ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుండటం దుర్మార్గం. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి, కేంద్రంలో ఉన్న మోడీ వలన రైతాంగానికి ఎలాంటి ప్రయోజనం లేదు.. కార్పొరేటు శక్తుల ప్రయోజనాల కొరకే పాలకవర్గాలు పనిచేస్తు న్నాయి. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని తమ సంఘం ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలను చేపడతాం.

## దశదిన కర్మలో పాల్గొన్న బయ్యారం సర్పంచ్

బయ్యారం, జూన్11, ప్రభాతవార్త:



బయ్యారం పంచాయతీ 7వ వార్డు సభ్యులు ఎట్టి సరిత తండ్రి బచ్చలి వెంకన్న దశదిన కర్మలో సర్పంచ్ గుగులోతు శాంతికిషన్‌నాయక్, ఉపసర్పంచ్ ఎనుగుల ఉమ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు పెద్దినేని శాంత, శీలం సరోజన, బట్టు ఉమాదేవి, బానోత్ సునిత, నందగిరి భద్రయ్య, తాటి జనార్దన్, కంకటి నారాయణ, పులి మల్లయ్య, ఆకునూరి సూర్యనారాయణ, నందిపాటి భవాని, నిమ్మల సోమిరెడ్డి, పందిరి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలి

### -చైర్మన్‌కు సర్పంచ్ ప్రవీణ్‌నాయక్ వినతి

బయ్యారం, జూన్11, ప్రభాతవార్త:



బయ్యారం మండలం కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్‌నాయక్ గురువారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డిని జిల్లా గ్రంథాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గంధంపల్లి, కొత్తపేట పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసి ఈ ప్రాంత యువతి, యువకులకు ఉపయోగపడేలా పాత భవనాన్ని అభివృద్ధి చేసి అందులో పుస్తకాలను అందుబాటులోకి తెచ్చి గ్రంథాలయాల ఆధునికీకరణ, మౌలిక వసతులు కల్పించి పోటీ పరీక్షలకు సన్నదం అయ్యే ఈ ప్రాంత యువకులకు సహకరించాలని కోరారు. అనంతరం గ్రంథాలయ చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. సర్పంచ్ వెంట వార్డు సభ్యులు శ్రీనివాస్, కిషన్, నాగమ్మ, మదన్, రాందాస్, రాము తదితరులు ఉన్నారు.

## నేడు రాకేష్‌రెడ్డి ఆన్‌లైన్ క్లాస్ మొబైల్ యాప్ ప్రారంభం

మహబూబాబాద్ రూరల్, జూన్11, ప్రభాతవార్త:

మహబూబాబాద్ మున్సిపాలిటి పరిధిలోని ఆర్తిగార్డెన్ ఫంక్షన్ హాల్లో నేడు ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాకేష్‌రెడ్డి ఆన్‌లైన్ క్లాస్ మొబైల్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు ఏనుగుల రాకేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా పోటీపరీక్షలకు సంబందించిన రికార్డెడ్ వీడియోలు, స్టడీ మెటీరియల్, ప్రాక్టిస్ కంటెంట్ ఉచితంగా అందు బాటులో ఉంటుందన్నారు. యాప్ ఆవిష్కరణలో యాప్ వినియోగంపై డెమో, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్దఎత్తున పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నేడు బయ్యారంలో భారీ ప్రదర్శన

### -తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్ పిలుపు

బయ్యారం, జూన్11, ప్రభాతవార్త:

పెంకు కార్మికుల వేతనాలు పెంచేవరకు ఉద్యమం ఆగదని నేడు బయ్యారంలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పెంకు ఫ్యాక్టరీల యజమానులు వారి ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న కార్మికులను శ్రమదోపిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యంత్రాలు వచ్చిన నాటి నుండి కార్మికులకు సరిగా పని దొరకడం లేదని దాన్ని ఆసరా చేసుకున్న ఫ్యాక్టరీల యాజమాన్యం నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి మాయమాటలు చెప్పి వారితో రాత్రింబవళ్ల పనిచేయిస్తూ శ్రమదోపిడికి పాల్పడుతున్నారన్నారు. దీనికి నిరసనగా చేపట్టిన భారీ ప్రదర్శనలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఖమ్మంలో భారీ చోరీ.!

మొదటి పేజీ తరువాయి..



తెలిపారు. ఖమ్మం సిటీ ఏసీపీ కథనం ప్రకారం.. గురువారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో ఘటన జరిగిందని షాపులోకి దుండగులు ప్రవేశించగానే అలారం మోగింది. అలారం మోతకు విజయవాడలోని సోనో విజన్ షాపునకు సంబంధించినవారు గమనించి 3.40 గంటల ప్రాంతంలో స్థానిక షాపు నిర్వాహకులకు, సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన ఖమ్మం సోనో విజన్ షాపునకు చెందిన వ్యక్తులు అక్కడికి చేరుకునేలోపే దుండగులు చోరీకి పాల్పడి షాపు నుంచి బయటకు వస్తున్నారు. అప్పటికే షోరూం బయట పారిపోయేందుకు కారును సిద్ధంగా ఉంచుకున్నారు. షో రూమ్ లో నుంచి బయట కు వచ్చిన దొంగలు కారు ఎక్కి పరారు అవుతుండగా షోరూం సిబ్బందిలో ఒకరు తమ ద్విచక్ర వాహనాన్ని అడ్డుపెట్టి వారిని ఆపేందుకు ప్రయత్నించిన నిందితులు కారు రివర్స్ తీసుకొని వేగంగా అక్కడి నుంచి ఉడాయించారు. అప్పటికే షాపు ముందు గల తమ కారులో దుండగులు పరారీ అయ్యేందుకు ప్రయత్నిస్తుండగా, అదే సమయానికి చేరుకున్న షాపు సిబ్బంది ఇద్దరు తమ బుల్లెట్ వాహనాన్ని కారుకు ముందు ఉంచి నిలువరించేందుకు ప్రయత్నించారు. అయినా దుండగులు కారును బుల్లెట్ పై షాపు సిబ్బంది అనుసరించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. షాపులో విలువైన ఐ ఫోన్లు, ఛార్జర్లు, అడాప్టర్లు వంటి సొత్తు చోరీకి గురైందని, వీటి విలువ రూ. 60 లక్షల వరకు ఉంటుందని ప్రాథమికంగా గుర్తించినట్లు ఏసీపీ రమణమూర్తి చెప్పారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని, దుండగుల కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు . అలారం మోతకు సంబంధించి విజయవాడ షాపు నిర్వాహకులు వారి సిబ్బందికి కాకుండా, తమకు సమాచారం అందిస్తే దొంగలను పట్టుకునేవారమని ఏసీపీ రమణమూర్తి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా ఘటనా స్థలాన్ని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి, చోరీ జరిగిన ప్రాంతాన్ని, షాపును పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నింది తులను వీలైనంత తొందరలో పట్టుకునేలా పోలీస్ అధికారులను ఆదేశించారు.

### కీలక ఆధారాలు, వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

నగరంలోని ప్రముఖ విక్రయ కేంద్రమైన ఖిసోని విజన్‌ఖి షోరూమ్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. నిందితులను పట్టుకునేలా పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుర్తుతెలియని దుండగులు షాపు తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి, స్టాక్ రూమ్‌లో భద్రపరిచిన విలువైన అధునాతన మొబైల్ ఫోన్లు చోరీ జరిగినట్లు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. షాపు పరిసర ప్రాంతాలలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# పాఠశాలలను పరిశీలించిన ఎంపీడీవోమోలిక వసతులపై ఆరా

*కారేపల్లి జూన్ 11 ప్రభాతవార్త*

ఈనెల 15వ తేదీ నుండి సింగరేణి మండలంలో ప్రారంభం అవుతున్న క్రమంలో పాఠశాలల్లో మోలిక వసతుల ఏర్పాటుపై ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్ గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల పరిధిలోని అప్పాయి గూడెం దుబ్బ తండా పాత కమలాపురం పాఠశాలలో సందర్శించారు. పాఠశాలలను శుభ్రం చేయడంతో పాటు టాయిలెట్స్ ఇతర సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలలకు సంబంధించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు నీరు సరఫరా అవుతుందా లేదా చూడాలని ఆయా పంచాయతీల కార్యదర్శులు పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఇటీవల గాలి దుమారాల ప్రభావంతో పాఠశాల పరిసరాల్లో ఏమైనా చెట్ల కొమ్మలు విరిగి పడితే వాటిని తొలగించాలని ఆదేశించారు.



## పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారం

*కారేపల్లి: జూన్ 11 ప్రభాత వార్త*

సింగరేణి మండలం మాణిక్యారం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఈ విద్యా సంవత్సరం పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించిన విద్యార్థులు భూక్యా మధుమతి, ఆంగోత్ శృతిక, సెకండ్ క్లాస్ మార్కులు సాధించిన డి. శంకర్ లను గురువారం ఖమ్మంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్ లో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో అధ్యక్షుడు తాండ్ర రాంప్రసాద్ రావు విద్యార్థులకు శాలువాలు కప్పి షీల్డు అందించి సన్మానించారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు భూక్యా రాంబాబు, ఆంగోత్ శోభన్ ,డి. కనకమ్మలను సైతం సన్మానించారు. ఈ



సందర్భంగా తాండ్ర రాంప్రసాద్ రావు మాట్లా డుతూ పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి అల్లిక రామకృష్ణ, సంస్థ సభ్యులు, పాల్గొన్నారు.

## హెల్త్ సబ్ సెంటర్ కోసం ఎమ్మెల్యే వినతి

### సర్పంచ్ వీర ప్రతాప్ టోనీ

*కారేపల్లి జూన్ 11 ప్రభాతవార్త*

మండల కేంద్రమైన సింగరేణి గ్రామంలో ప్రత్యేక హెల్త్ సబ్ సెంటర్ భవనం లేకపోవడంతో గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా వైద్య సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలోఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. సింగరేణి గ్రామం భరత్ నగర్ కాలనీ లో హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు . స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సింగరేణిలో హెల్త్ సబ్ సెంటర్ అవసరాన్ని గుర్తించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులకుప్రతిపాదనలు పంపాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూగ్రామ ప్రజల ఆరోగ్య సమస్యలను అర్థం చేసుకుని సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే చొరవతో త్వరలోనే సింగరేణికి హెల్త్ సబ్ సెంటర్ మంజూరై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఎమ్మెల్యే కు కారేపల్లి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.



# శస్త్ర చికిత్స ఫేలై ఆరేళ్ళ బాలుడు మృతి

### హాస్పిటల్ ఎదుట కుటింబికుల ఆందోళ

*ఖమ్మం వైద్య విభాగం, జూన్ 11(ప్రభాత వార్త )*

ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో ఉన్న ప్రవేట్ చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్యుడి నిరక్ష ్యం కారణంగా ఆరేళ్ల బాలుడి నిండి ప్రాణం పోయింది.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం రూరల్ మండలం జాన్ బాద్ తాండా కు చెందిన జర్పుల వీరన్న,దేవి దంపతుల కు ఇద్దరు మగ సంతానం.వారిలో చిన్న వాడికి వరిబీజం శస్త్ర చికిత్స కోసం



ఆర్ఎంపి సహాయంతో గీతికా హాస్పిటల్ వైద్యుడు వద్దకు బుధవారం ఉదయం వచ్చి అడ్మిట్ అయ్యారు.బాలుడికి సర్జరీ చేసిన తర్వాత వెంటిలేషన్ అవసరమని డాక్టర్ నెహ్రూ నగర్ లో ఉన్న మరో ప్రైవేట్ దవాఖానకు షిఫ్ట్ చేశారు.సాయంత్రం వేళా సర్జరీ ఫెయిల్ అయ్యి బాలుడు మృతి చెందిన విషయాన్ని కుటింబికులు గ్రహించారు.బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. గురువారం కూడా ఆందోళనను కొనసాగించారు.హాస్పిటల్ మేనేజ్మెంట్ దిగి వచ్చి కుటుంబ పెద్దలతో ఎలాంటి కేసు లేకుండా రాజీకి యత్నించారు.రాజీ లో భాగంగా బాలుడి కుటుంబానికి ఆరున్న లక్షలు నష్ట పరిహారం గా చెల్లించి చేతులు దులిపేసుకున్నారు. ఈ వివాదంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం పట్ల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.చివరకు స్వగ్రామానికి బాలుడి డెడ్ బాడీని తీసుకెళ్లడంతో వివాదం సద్దుమనిగింది.

## గంజాయి సేవిస్తున్న 5 గురు అరెస్టు, 3 పరారీ

*పాల్వంచ, జూన్ 11 (ప్రభాత వార్త):*

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని లక్షి ్మపల్లి గ్రామపంచాయతీలో పోలీసులు గంజాయి సేవిస్తున్న వారిపై దాడులు నిర్వహించారు.స్థానికుల సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 8 మందిని అదుపులోకి తీసుకున్నారు.అనంతరం వారిలో 5 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించగా,మిగిలిన 3



మంది పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి సుమారు 2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ ధర ప్రకారం స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని, ఒక కిలో గంజాయి ధర సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని స్థానిక ఎస్సై బి.సురేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై బి. సురేష్ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,గంజాయి విక్రయాలు లేదా వినియోగంపై ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## వడదెబ్బతో జవాన్ మృతి

*వైరా టౌన్ జూన్ 11 (ప్రభాతవార్త)*

వైరా మున్సిపాలిటీ నందు జవాన్ గా పనిచేస్తున్న భానోత్ గాంధీ లాల్ (50) బుధవారం నాడు విధులను ముగించుకొని ఇంటికి వచ్చిన తర్వాత తీవ్ర అవస్థకు గురి అయ్యాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు



అప్పటికే వైద్యులు మరణించారని ధ్రువీకరిచటం జరిగింది. మృతుని భార్య ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. కొనిజర్ల పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైరా ఎస్టి కాలనీలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.




## గేదెలు డీకొని సెక్యూరిటీ గార్డ్ కు తీవ్ర గాయాలు

*నేలకొండపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:*

పైనంపల్లి గ్రామం వద్ద గల చెక్ పోస్ట్ నందు సెక్యూరిటీ గార్డ్ మారగాని వీరబాబు విధులు నిర్వహిస్తుండగా ఓ వాహనం చెక్ పోస్ట్ వద్ద ఆగకుండా వెళ్తుండటంతో బైక్ పై వెంబడించారు. అదే సమయంలో గేదెలు డీకొని



వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డు మారగాని వీరబాబుకు తీవ్ర గాయాలైయ్యాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని కనీసం తాను పెట్టిన పెట్టుబడి అయినా అందించాలని వేడుకుంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయం పరిధి లోని పైనంపల్లి వద్ద చెక్ పోస్ట్ లో సెక్యూరిటీ గార్డు గా విధులు నిర్వహిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తుండుగా రాత్రి సమయంలో ఓ వాహనం పై అనుమానం రావటంతో బైక్ పై వెంబడస్తుండుగా గేదెలు తగిలి రోడ్డు పై పడ్డారు. దీంతో మారగాని వీరబాబుకు తీవ్ర గాయాలైయ్యాయి. ప్రస్తుతం ఖమ్మం లోని ఓ ప్రవేట్ హస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. కాగా నేటి వరకు సంబంధిత శాఖ అధికారులు కనీసం పరామర్శించలేదని, ఏం జరిగిందని కూడ ఆడగలేదని బాధితుడు వీరబాబు వాపోయాడు. చెక్ పోస్ట్ నిర్మాణం కొరకు రూ.1.50 లక్షలను అందినకాడికల్లా అప్పులు చేసి టోల్ గేట్ వద్ద నిర్మించారు. కనీసం ఆ బిల్లులు కూడ ఇవ్వలేదని ఆయన ఆవేదన చెందారు. తెచ్చిన అప్పులకు ప్రతీ నెలా వడ్డీ ని తాను సొంతంగా కడుతున్నానని చెప్పారు. ఇదే చెక్ పోస్ట్ నుంచి టార్గెట్ కు మించి దాదాపు లక్షల ఆదాయంను సమకూర్చారు. కాగా ప్రమాద సమయంలో కూడ సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రావాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలని, అదే విధంగా వేతనాలు అందించాలని సెక్యూరిటీ గార్డ్ మారగాని వీరబాబు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

*పెనుబల్లి, జూన్ 11, ప్రభాతవార్త*

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మండల పరిధి లోని లింగగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోరు చేసుకుంది. ఈ ప్రమాదంలో లింగగూడెం గ్రామానికి చెందిన పద్దం విష్ణు (19), ములకలపల్లి మండలం కమలాపురంకి చెందిన మిడియం శివ సన్నీ (19) మృత్యువాత చెందారు.వివరాల్లోకి వెళితే పద్దం విష్ణు తన స్నేహితుడు విరపా గోపరాజు కలిసి కమల ాపురం గ్రామానికి చెందిన మరో మిత్రుడు మిడియం శివను విఎం బంజర్ లో బైక్ ఎక్కించుకుని ముగ్గురు కలిసి లింగగూడెం బయలుదేరారు. ఈ క్రమంలో లింగగూడెం గ్రామం చేరుకునే సరికి ఆకస్మాతుగా రోడ్డుకి అడ్డంగా వచ్చిన గేదే ను బలంగా ఢీ కొట్టి గాలిలో ఎగిరి రోడ్డుపై పడిపో యారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మిత్రులకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 కి సమాచారం అందించడంతో 108 సిబ్బంది క్షతగాత్రులను హుటా హుటిన పెనుబల్లి ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. బైక్ నడుపు తున్న పద్ధం విష్ణు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో యువకుడు మిడియం శివ సన్నీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. గాయపడిన మరో యువకుడిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఈ ఘటనతో లింగగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై విఎం బంజర్ పోలీసులు విచారణ చేపట్టారు.


**పత్రికా ప్రకటన**

'ఫైన్ హై స్కూల్' (రావినూతల) విషయంలో ప్రజలకు మరియు విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ ప్రజా ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ **శ్రీ యరమల రవీంద్రారెడ్డి** గారి సూచనల మేరకు, రావినూతల గ్రామం, బోనకల్లు మండలం, ఖమ్మం జిల్లాలోని సర్వే నంబర్లు 140/A మరియు 141/E లలో విస్తరించి ఉన్న ఆస్తిలో ఎటువంటి పాఠశాల కార్యకలాపాలు నిర్వహించకూడదని సత్తుపల్లి అదనపు జిల్లా కోర్టులో O.S. No. 5/2026 దాఖలు చేయడమైనది. ప్రస్తుతం రావినూతలలోని 'ఫైన్ హై స్కూల్' యాజమాన్యానికి నా క్లయింట్ ఎటువంటి లీజు ఒప్పందాన్ని కొనసాగించడం లేదని తెలియజేస్తున్నాము. అంతేకాకుండా, సదరు పాఠశాలకు నర్సరీ నుండి ఐదవ తరగతి వరకు అనుమతులు పునరుద్ధరణ కాలేదని సంబంధిత విద్యాశాఖ అధికారుల ద్వారా మా క్లయింట్‌కు సమాచారం అందినది.

కావున, చట్టపరమైన చిక్కుల దృష్ట్యా, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ పాఠశాలలో చేర్పించే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మరియు పూర్తి వివరాలను విచారించుకోవాలని సూచించడమైనది.

**షెడ్యూల్ ఆస్తి వివరాలు:**

రావినూతల గ్రామం, బోనకల్లు మండలం, ఖమ్మం జిల్లా, సర్వే నంబర్లు 140/A, 141/E లో ఉన్న మొత్తం 10043 చదరపు గజాల ఖాళీ స్థలం మరియు H.No. 11-13/2 కలిగిన గ్రౌండ్, మొదటి మరియు రెండవ అంతస్తు గల భవనం.

**ఆస్తి సరిహద్దులు:**

**తూర్పు:** 29-6 అడుగుల వెడల్పు గల రోడ్డు.
**పడమర:** 5 అడుగుల సొంత మార్గం.
**ఉత్తరం:** ధరావత్ సాధు గారి భూమి.
**దక్షిణం:** రోడ్డు.

ఇట్లు,
**G. మోసెస్ క్రిస్టోఫర్**
**న్యాయవాది**
**ఖమ్మం**
**ఫోన్ 9849128958**

# గ్రామ స్థాయి కమిటీల ద్వారానే పార్టీని బలోపేతం చేయండి

**- బిఆర్ఎస్ పార్టీ భద్రాచలం ఇంచార్జ్ రావులపల్లి రాంప్రసాద్**

దుమ్ముగూడెం ప్రభాతవార్త :





బి.ఆర్.ఎస్ పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు లో భాగంగా సభ్యత్వ నమోదు విజయవంతంగా చేపట్టడం తో పాటు గ్రామ స్థాయిలో పార్టీ ని బలోపేతం చేయడం గ్రామ కమిటీల నిర్మాణం తోనే సాధ్యమవుతుందని టిఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజక వర్గ బాధ్యుడు రావులపల్లి రాంప్రసాద్ అన్నారు గురువారం లక్షీ ్మనగరం లోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో తొలి ముఖ్యమంత్రిగా కెసిఆర్ నడిపించి దేశం మొత్తానికి ఆదర్శంగా నిలిపారనీ కానీ గత ఎన్నికల్లో కాంగ్రెస్ మాయమాటలు నమ్మి బి ఆర్ ఎస్ పార్టీని ఓడించి ఈ రోజు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పుడు ఎన్నికలు జరిగితే కెసిఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి చేయడానికి కారు గుర్తు పై ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని ఆదిశగా ప్రతీకార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు కేసీఆర్ ఆలోచన విధానాన్ని ఖచ్చితంగా అమలు చేసేదంట్లో బాగంగా గ్రామస్థాయిలో పార్టీ ని బలోపేతం చేసేందుకు గ్రామ స్థాయిలో పనిచేసేవారికి బాధ్యులుగా నియామకం చేయాలని మహిళలకు ప్రాధాన్యత నివ్వాలని కేంద్ర బి ఆర్ ఎస్ పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదును నిఖార్సైన పార్టీ సభ్యులకు అందించాలని పిలుపు నిచ్చారు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు నియోజక వర్గ నాయకుడు మానె.రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణా ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ గెలుపు తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పాలకులు తమ సంపాదనే ధ్యేయంగా దోచుకోవడం దాచుకోవడమే లక్ష ్యంగా పని చేస్తున్నారని ప్రజల సంక్షేమం గాలికి వదిలేశారని విమర్శించారు అనంతరం రావులపల్లి రాంప్రసాద్ను కార్యకర్తలు సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేసు లక్షీ ్మ,మండల కన్వీనర్ కణితి రాముడు కో కన్వీనర్ జానీ పాషా నాయకులు అపక వీర్రాజు కొత్తూరు సీతారామారావు తునికి కామేష్ రావులపల్లిపృధ్వీ దామెర్ల.శ్రీనివాస్ తంతరపల్లివెంకటేశ్వర్లు లంకశివ బొల్లి.వెంకటరావు కాలువ.పూర్ణయ్య పీసోడీ వెంకటేష్సర్పంచ్ లు వాగేఖాదర్ బాబు మడకంజోగయ్యనాయకులు,భూక్యా చందు కాటిబోయిన వెంకటేశ్వర్లు శ్రీను కుంజా నాగేశ్వరావు వాగే కృష్ణ పాయం బాలు సూర్య గోసంగి కిరణ్ అపకా వెంకటేష్ మర్మం గంగరాజు సోయం నర్సింహారావు,జంగిటి రాము, జిలకర గంగరాజు పలువురు బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలలో బ్రిలియంట్ విద్యార్థులు ప్రభంజనం

సారపాక, ప్రభాతవార్త:

ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలలో బ్రిలియంట్ విద్యార్థులు కార్పొరేట్ కి దీటుగా మేమేమి తక్కువ కాదని రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ డా బి ఎన్ ఆర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు, ఎంపీసీ విభాగంలో 470 గాను యం. అరుణ్ కుమార్ 467, కే. భణ్య శ్రీ 467, ఆర్. పావని 466, టి. భవ్య శ్రీ 466 ఎండి. ఫైజాన్ 466, సిహెచ్. అభిరామ్ రెడ్డి 464, వి.కే.ఎస్ సంతోషిని 463 రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన బ్రిలియంట్ విద్యార్థులని చైర్మన్ డా బి ఎన్ ఆర్ అభినందించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న ప్రకటించిన ఎప్ సెట్ ఫలితాలలో 1498 ర్యాంక్ సాధించి భద్రాచలం డివిజన్ లో ఎక్కడ లేని విధంగా మన బ్రిలియంట్ విద్యార్థులు మంచిర్యాంకులు సాధించారు, మీరు కూడా భవిష్యత్తులో జరగబోయే సెకండ్ ఇయర్ పరీక్ష ఫలితాలలో మళ్లీ స్టేట్ మార్కులు తెచ్చుకొని అలాగే ఎప్ సెట్ లో కూడా మంచి ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు కళాశాలకు మన మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షి ంచారు, వచ్చే నెల ఒకటో తారీకు నుండి ఎప్ సెట్ లాంగ్ టర్మ్ , జేఈఈ మెయిన్స్ కి కోచింగ్ ఇవ్వనన్నట్లు ఆయన తెలియజేశారు విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని టాప్ 10 కాలేజీల్లో సీటు సాధించాలని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



467/470 M.ARUN KUMAR



467/470 K.BHANYA SRI



466/470 MD. FAIZAN



466/470 T.BHAVYA SRI



466/470 R.PAVANI



464/470 CH.ABHIRAM REDDY



463/470 V.K.S SANTHOSHINI




## బిజెపి జిల్లా ఈసీ మెంబర్‌గా ములిశెటి రామ్మోహన్ రావు

భద్రాచలం టౌన్,ప్రభాతవార్త :



భారతీయ జనతా పార్టీ ( బిజెపి ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులుగా ములిశెట్టి రామ్ మోహన్ రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఈ గురుతర బాధ్యతను అప్పగించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అలాగే తనకు వెన్నుదన్నుగా నిలిచిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నాయకత్వం తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, జిల్లాలో పార్టీ బలోపేతానికి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. అందరినీ కలుపుకుంటూ బాధ్యతాయుతంగా ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. ఈ తరుణంలో రామ్మోహన్ రావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## పీఎంశ్రీ ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు

**- ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సావిత్రి**

**దుమ్ముగూడెం ప్రభాతవార్త:** దుమ్ముగూడెం మండల కేంద్రంలో గల లక్షీ ్మనగరం కే రేగుబల్లి 1 పియంశ్రీ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆరో తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాలు నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయురాలు ఎస్ సావిత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు పాఠశాలలో జాయిన్ అయ్యే విద్యార్థులు టిసి మరియు స్టడీ సర్టిఫికెట్స్ తీసుకు రావాలని పాఠశాలలో హాస్టల్ వసతులు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన ఉచిత యూనిఫామ్ కాస్మొటిక్స్ రుచికరమై పౌష్టిక భోజనం స్పోర్ట్స్ డిజిటల్ క్లాసెస్అటల్ టింకరింగ్ కంప్యూటర్ విద్య మ్యూజిక్ క్లాసెస్ కుట్లు అల్లికలు అగ్రికల్చర్ క్లాసెస్ ఇంకా అనేకమైన పియంశ్రీ యాక్టివిటీస్ నిర్వహించనున్నట్లు విద్యార్థిని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆశ్రమ పాఠశాల హెచ్ ఎం విజ్ఞప్తి చేశారుపూర్తి వివరాల కోసం 6303611528,6305003533 ఈ ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆమె తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.



# భద్రాచలంలో పోలీసుల మెరుపు తనిఖీలు

**- అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సోదాలు**

**- సీసీ కెమెరాలపై లాడ్జి నిర్వాహకులకు డీఎస్పీ కీలక ఆదేశాలు**

భద్రాచలం, ప్రభాతవార్త:

భద్రాచలం పట్టణంలో పోలీసులు అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా మెరుపు తనిఖీలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం తెల్లవారుజామున 12:30 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు పట్టణంలోని లాడ్జీలు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర సోదాలు నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అనుమానిత వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని



అరికట్టడమే ధ్యేయంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని మొత్తం 62 లాడ్జీలతో పాటు, స్థానిక బస్టాండ్ పరిసరాల్లో పోలీసులు జల్లెడ పట్టారు. అధునాతన ఫింగర్ ప్రింట్ డివైజ్‌లు, డాగ్ స్క్వాడ్ బృందాలతో లాడ్జీల్లోని ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. సోదాల సమయంలో లాడ్జీల యజమానులు, మేనేజర్లు, సిబ్బంది యొక్క పూర్తి వివరాలను సేకరించారు. లాడ్జీలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పోలీసులు ఈ సందర్భంగా పరిశీలించారు. కెమెరాల ఫుటేజ్ కనీసం 2 నెలల (60 రోజులు) పాటు బ్యాకప్ ఉండేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ ఆదేశించారు. అంతేకాకుండా, లాడ్జీల వెలుపల రహదారిపై వచ్చిపోయే వాహనాల కదలికలు స్పష్టంగా రికార్డు అయ్యేలా కెమెరాలను రోడ్డు వైపు అమర్చాలని స్పష్టం చేశారు.ఈ ఆకస్మిక తనిఖీల్లో భద్రాచలం టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, మహిళా పోలీసులు, ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కమలాపూర్ మునిందర్‌కు ఆర్యవైశ్య మహాసభలో కీలక పదవి

కమలాపూర్: ప్రభాతవార్త.



!!తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మీడియా విభాగం వైస్ చైర్మన్‌గా కమలాపూర్‌కు చెందిన కొనిశెట్టి మునిందర్ నియమితులయ్యారు. 202628 కాలానికి ఈ నియామకాన్ని రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ చేశారు. హన్మకొండ జిల్లా మహాసభ పునర్ వ్యవస్థీకరణ, ఎన్నికల నిర్వహణ, మండల కమిటీల ఏర్పాటులో మునిందర్ కీలకంగా వ్యవహరించడంతో జిల్లా మహాసభ ఆయన పేరును రాష్ట్ర స్థాయికి సిఫార్సు చేసింది. బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి మునిందర్ కృతజ్ఞతలు తెలిపారు. మహాసభ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# హుజురాబాద్ బీఆర్ఎస్ శ్రేణులకు సభ్యత్వ నమోదుపై నేడు అవగాహన కార్యక్రమం...

కమలాపూర్: ప్రభాతవార్త.

పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతృత్వంలో సభ్యత్వ నమోదు, సర్ ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహన సదస్సు రేపు జమ్మికుంట ఎంపీఆర్



ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బోయినపల్లి వినోద్ కుమార్ కూడా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. సదస్సు మొత్తాన్ని హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ పాడి కౌశిక్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కమలాపూర్ మండలం నుంచి సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, గ్రామస్థాయి కీలక నాయకులు, యువ నాయకులు, పార్టీ కార్యకర్తలు ఈ సదస్సులో పాల్గొననున్నారు. సభ్యత్వ నమోదు, ఓటర్ నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, ప్రతి ఒక్కరు తమ నియోజకవర్గ పరిధిలోనే నమోదు చేసుకునేలా వారికి స్పష్టమైన మార్గదర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు పార్టీ భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, సభ్యత్వ నమోదును విజయవంతం చేయాల్సిన ఆవశ్యకతను కార్యకర్తలకు వివరించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పెద్ద ఎత్తున హాజరు కావాలని నిర్వాహకులు తక్కలపల్లి సత్యనారాయణ రావు కోరారు. సదస్సు నేడు ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది. సన్నాహక సమావేశంలో తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు, లాండిగే లక్ష్మణ్ రావు, ఇమ్మడి చెట్టి శ్రీనివాస్, దొంగల శ్రీనివాస్, క్యాల సాంబయ్య, జెట్టి సురేష్, సర్పంచ్ రాజేష్ తదితరులు పాల్గొని ఏర్పాట్లపై చర్చించారు.

# కమలాపూర్ మార్కెట్ చైర్మన్ ఝాన్సీరాణికి "నారి శక్తి" అవార్డు

కమలాపూర్: ప్రభాతవార్త.

రాజకీయ, రైతు సేవా రంగాల్లో విశేష కృషి చేస్తున్న మహిళలను గుర్తించి సత్కరించే క్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తొటం ఝాన్సీ రాణి రవీందర్‌కు "నారి శక్తి" అవార్డు లభించిం ది.దేశ



వ్యాప్తంగా సేవా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన "భారత్ కి అన్మోల్" సంస్థ ఈ అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్ గ్రీన్ పార్క్ హోటల్ మేరీ గోల్డ్ వేదికగా జరిగిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న 40 మంది మహిళలను ఎంపిక చేసి సన్మానించారు. తెలంగాణ నుంచి రాజకీయ మరియు రైతు సేవా విభాగం నుండి ఝాన్సీ రాణి ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. అవార్డు అందుకున్న అనంతరం మాట్లాడిన ఝాన్సీరాణి, మహిళలు కేవలం గృహ బాధ్యతలకే పరిమితం కాకుండా రాజకీయాలు సహా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని పిలుపునిచ్చారు. తన సామాజిక, రైతు సేవా కార్యకలాపాలను గుర్తించి ఈ స్థాయి గౌరవం కల్పించినందుకు "భారత్ కి అన్మోల్" సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు, మహిళలకు అండగా నిలిచేందుకు తన ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

# ఇంటర్ అడ్వాన్స్ ఫలితాలలో సత్తాచాటిన కాకతీయ విద్యార్థులు

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరి ఫలితాలలో హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించి సత్తా చాటారు. ఎంపిసి ప్రథమ సంవత్సరంలో అక్షత, ఎన్. మనుశ్రీలు 468 మార్కులు, జీనత్ 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారని కళాశాల కరస్పాండెంట్ వేణు మాధవ్ తెలిపారు. బైపిసి ప్రథమ సంవత్సరంలో యూసియా వర్ణీ 436 మార్కులు, సుభాష్ చంద్ర 435 మార్కులు సాధించి డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని అన్నారు. సిఈసి ప్రథమ సంవత్సరంలో సిద్రా ఇర్షాద్ 485 మార్కులు, జె. సాయి రక్ష 479 మార్కులు సాధించి డివిజన్ స్థాయి ప్రథమ స్థానంలో నిలిచారని అన్నారు. అద్భుత విజయాన్ని సాధించిన పిల్లలను కళాశాలలో కరస్పాండెంట్ వేణుమాధవ్, డైరెక్టర్లు సిహెచ్ రాజేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి తదితరులు అభినందించారు.



# నేడు జమ్మికుంటకు హరీష్ రావు సభ్యత్వ నమోదు

## కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.....

### జమ్మికుంట రూరల్ ఇంచార్జ్ పింగళి రమేష్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట పట్టణంలోని ఎస్పిఆర్ గార్డెన్లో నేడు నిర్వహించే బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు అలాగే సర్ పై అవగాహన కార్యక్రమానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు రానున్నారని ఈ కార్యక్రమాన్ని



విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ జమ్మికుంట రూరల్ ఇన్చార్జ్ పింగళి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం జమ్మికుంట మండలంలోని నాగంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక బిఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు, శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని జమ్మికుంట మండల పరిధిలోని 20 గ్రామాల ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు బూతు లెవెల్ నాయకులు భారీ ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటించి ఉదయం పదిగంటల వరకు స్థానిక ఎం పి ఆర్ గార్డెన్ లో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని కార్యక్రమ అనంతరం భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం బిఆర్ఎస్ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసే సభ్యత్వాలు పెంచాలని లక్ష్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే సర్ పై బూతు లెవల్ ఇన్చార్జిలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తోపాటు టెక్నికల్ కార్పొరేషన్ చైర్మన్ చిరుమల్ల రాకేష్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గండ్రపల్లి ఎంపిటిసి తోట లక్ష్మణ్ బిఆర్ఎస్ సర్పంచ్ ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి నాగంపేట మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి తనుగుల మాజీ సర్పంచ్ విలుమల రామస్వామి అంకుశాపూర్ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ యూత్ నాయకులు రాపర్తి అఖిల్ గౌడ్ ఉల్లాల శ్రీకాంత్ గౌడ్ అప్పని హరీష్ వర్మ జోడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుండ్ల చెరువుకు హద్దులు పాతి కబ్జాదారుల నుండి కాపాడాలి

-- ఎమ్మెల్యేకు మత్స్యకారులు, రైతుల వినతి

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:

హుజూరాబాద్ పట్టణ శివారులోని మత్స్యకారులకు వరప్రదాయనిగా ఉన్న గుండ్ల చెరువుకు హద్దులు పాతి కబ్జాదారుల నుండి కాపాడాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి గురువారం మత్స్యకారులు, రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే తో మాట్లాడుతూ హుజూరాబాద్ గుండ్ల చెరువు వల్ల మత్స్యకారులు చేపలు పెంచడమే కాకుండా, రైతులు తమ పంటలను పండించుకుంటున్నారని అన్నారు. కానీ కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు పరిసర ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసి చెరువును కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇంతేకాక తమ భూములను మంచి ధరకు విక్రయించుకోడానికి గాను అధికారులు తప్పుడు సమాచారం అందిస్తున్నారని అన్నారు. ఇంతే కాకుండా మత్తడి రాళ్లను తీసి వేయించి వారి భూములకు ధర పలికే విధంగా చూస్తున్నారని అన్నారు. సుమారు 500 మంది మత్స్యకార కుటుంబాలు, అనేక మంది రైతులు గుండ్ల చెరువుపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. గుండ్ల చెరువు హద్దులు నిర్ణయించి చెరువు భూమి కబ్జా కాకుండా కాపాడాలని ఎమ్మెల్యేలను వేడుకున్నారు. అనంతరం హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో, తహశీల్దార్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ కిషన్, ఇరిగేషన్ ఈఈ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్, సంఘం గౌరవ అధ్యక్షులు గుడ్డెల్లుల సమ్మయ్య, అధ్యక్షుడు గుడ్డెల్లుల పోచయ్య, మొటం రవీందర్, పిల్లి సమ్మయ్య, ఎంపటి సదానందం, శంకర్, గుడ్డెల్లుల రవి, సారయ్య, ఎంపటి సతీష్ కుమార్, బొగ్గుల రాజేశం, రైతులు పాల్గొన్నారు.



# మాదన్నపేటలో బెల్ట్ షాపులపై మహిళల ఉద్యమం -

### నిషేధం కోసం తీర్మానం చేయాలని సర్పంచ్ కి వినతి...

కమలాపూర్: ప్రభాతవార్త

.కమలాపూర్: మండలంలోని మాదన్నపేట గ్రామంలో అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని గ్రామ మహిళా సంఘాల సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మద్యం వల్ల కుటుంబాల్లో చెలరేగుతున్న అశాంతి, ఆర్థిక కష్టాలను దృష్టిలో పెట్టుకుని గ్రామాన్ని మత్తు రహితంగా మార్చాలనే సంకల్పంతో వారు ముందుకు వచ్చారు. గ్రామ సర్పంచ్ కత్తి రమేష్‌ను కలిసిన మహిళా సంఘాల సభ్యులు, బెల్ట్ షాపుల వల్ల యువత, కుటుంబాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తు, మహిళల భద్రత దృష్ట్యా గ్రామంలో ఎలాంటి అక్రమ మద్యం విక్రయాలకు తావు లేకుండా చూడాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. మహిళల ఆందోళనను గుర్తించిన సర్పంచ్ కత్తి రమేష్, గ్రామ పాలకవర్గంతో చర్చించి వెంటనే తీర్మానం చేస్తామని గ్రామ పరిధిలో ఎక్కడా బెల్ట్ షాపులు కొనసాగనివ్వబోమని, నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివోలు రజిత, వసంతతో పాటు వివిధ స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. గ్రామాన్ని మత్తు రహితంగా మార్చేందుకు పాలకవర్గానికి పూర్తి సహకారం అందిస్తామని మహిళలు పేర్కొన్నారు



# “భూమి విక్రయించి... ఇప్పుడు తిరగబడుతున్నారు”

**- రూ.57 లక్షలకు కొన్న భూమిపై వివాదం సృష్టిస్తున్నారని బాధితుల ఆరోపణ**

**- భూతగాదాలో సంబంధం లేని వ్యక్తులు జోక్యం చేస్తున్నారని ఆరోపణ**

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన కొనుగోలుదారులు**



**లక్ష్మీదేవిపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:** రూ.57 లక్షలు చెల్లించి కొనుగోలు చేసిన భూమిని ఆర్నెల్ల తర్వాత ఇవ్వకుండా విక్రయదారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని భూ బాధితులు ఆరోపించారు. భూమితో సంబంధం లేని కొందరు వ్యక్తులు కూడా ఈ వివాదంలో తలదూర్చి తమను అడ్డుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాధితులు గుగులోతు విష్ణు, వర్సా లక్ష్మయ్య, మనోహర్, చాతకొండ సర్పంచ్ వజ్జా ఈశ్వరమ్మ, నీరజ, ప్రమేందర్, రేవంత్‌లు మాట్లాడారు.

**- అసలు వివాదం ఏమిటి?**

లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ రెవెన్యూ పరిధిలోని సాటివారిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళకు సంబంధించిన సర్వే నెంబర్ లోని ఎకరం 37 గుంటల భూమిని 2016లో రూ.57 లక్షలకు కొనుగోలు చేశామని బాధితులు తెలిపారు. “రూ.57 లక్షలకు గాను రూ.20 లక్షలు ఆన్‌లైన్‌లో జమ చేశాం. మిగిలిన రూ.37 లక్షలు నగదు రూపంలో చెల్లించాం. క్రయ విక్రయాలకు సంబంధించిన అన్ని పత్రాలు మా దగ్గర ఉన్నాయి“ అని వారు పేర్కొన్నారు.

**- కోర్టు తీర్పు మా వైపే అంటున్న బాధితులు...**

భూమి కొన్న ఆరు నెలల తర్వాత విక్రయదారులు వివాదం సృష్టించడంతో తాము హైకోర్టును ఆశ్రయించామని బాధితులు తెలిపారు. “వాయిదాలకు విక్రయదారులు రాకపోవడంతో కోర్టు మాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఇటీవల కోర్టు ఆదేశాలతో భూమిని చదును చేసేందుకు వెళ్తే విక్రయదారుల కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు“ అని వారు ఆరోపించారు.

**- సంబంధం లేని వ్యక్తుల జోక్యంపై బాధితుల ఆగ్రహం:**

“ఈ భూమిపై ఎటువంటి హక్కు లేని కొందరు వ్యక్తులు అక్కడికి వచ్చి మమ్మల్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రతి విషయంలో తలదూర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని“ బాధితులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై లక్ష్మీదేవిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని, భూమికి సంబంధించిన అన్ని ఆధారాలను ఉన్నతాధికారులకు అందజేశామని వారు పేర్కొన్నారు. లక్షలు వెచ్చించి కొన్న భూమి కోసం ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్నామని, జిల్లా, మండల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

## రైల్వే డబ్లింగ్ పనులలో నష్టపోతున్న నిరుపేద కుటుంబాలు

**పరిహారం చెల్లింపులు ఎనిమిది కుటుంబాలకు తీవ్ర నష్టం**

**కుంటల లెక్కన పరిహారం ఏంటి! ఇదెక్కడి న్యాయం?**

**గజాల పరిగణన తోనే పరిహారం చెల్లించాలి**

**ప్రత్యామ్నాయంగా ఇల్లు నిర్మించి ఇవ్వండిబాధితుల గోడు**

**కారేపల్లి జూన్ 11 ప్రభాతవార్త**

డోర్నకల్ కొత్తగూడెం రైల్వే మార్గంలో రెండవ లైను ఏర్పాటు చేసేందుకు వీలుగా అధికారులు భూ సేకరణ చేపట్టారు. రైల్వే శాఖ నష్టపరిహారం చెల్లింపులో ఆర్థికపరంగా తీవ్ర నష్టాలకు గురవుతున్నామని ఇదెక్కడి న్యాయమని బాధితులు ప్రశ్నిస్తున్నారు. పక్కా గృహాలు స్థలాలు కలిగి ఉన్న పలు కుటుంబాలకు సంబంధించి 20 మందికి పైగా నిర్వాసితులవుతున్నారు. అయితే ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంతంలోనే నివసిస్తున్న స్థలంలోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలని లక్ష్యంతో పలు కుటుంబాల వారు ఉన్నారు. అయితే 8 మంది నిర్వాసితులలో సాదిక్ ఆలీ వృద్ధ దంపతులతో పాటు అడప మల్లేష్ తుమ్మలత లతోపాటు పలువురు ఉన్నారు. అయితే సాదిక్ ఆలీ వృద్ధ దంపతుల కు సంబంధించి ఇందిరమ్మ ఇల్లు ఏర్పాటు చేసుకోవాలనే లక్ష్యంతో నీటి పంపు కలెక్షన్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతము వారికి నివసించడానికి ఇల్లు లేకపోవడంతో కూతురు ఇంటి వద్ద ఆశ్రయం పొందుతున్నారు. మా సొంత ఇంటి స్థలం కోల్పోతున్న క్రమంలో దానికి సంబంధించి రైల్వే శాఖ రైల్వే శాఖ కుంటరేటున పరిహారం చెల్లిస్తామనడం ఎంతవరకు సబబు అన్నారు మాకు గజాలను పరిగణ లోకి తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని లేకపోతే ప్రత్యామ్నాయంగా కారేపల్లి లోని నివసించడానికి ఇల్లు ఏర్పాటు చేయాలని బాధితులు కోరుతున్నారు. అలా కాకపోతే ఆ స్థలం వద్ద తాము ఆందోళన ప్రారంభిస్తామని తెలిపారు అయితే గతంలో సంబంధిత అధికారులు కారేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేసి ప్రస్తుతం మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు ప్రస్తుతం అధికారులు వ్యవసాయ భూమిగా పరిగణించి తక్కువ రేటును కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ విధంగా విలేజ్ సైట్ కు సంబంధించి ఎస్సీ కాలనీకి చెందిన తొగర శ్రీను రమేషులకు సంబంధించి గ్రామ కంఠం కింద ఏడున్నర కుంటల భూమిని రైల్వే శాఖ తీసుకొని కుంటల రేటు ప్రకారం పరిహారం చెల్లించారని అయితే మాకు ఆర్థికపరంగా నష్టం వస్తుందని మా భూమి కి గజాలను పరిగణలోకి తీసుకొని పరిహారం చెల్లించాలని కోరుతూ భూసేకరణ డిప్యూటీ కలెక్టర్కు వినతి పత్రం అందజేసినట్లు బాధితులు తెలిపారు. నిరుపేద కుటుంబాల పరిస్థితిని అర్థం చేసుకొని ఇప్పటికైనా రైల్వే శాఖ జిల్లా అధికారులు తాము ఇంటి స్థలాలను కోల్పోవడంతో పాటు ఆర్థికంగా నష్టాల పాలు అవుతున్నామని మాకు న్యాయం జరిగేలా ఇంటి స్థలాల గజాలను పరిగణలోకి తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో నే మంచి విద్య లభిస్తుంది

**- ఎంఈఓ రాపెల్లి శ్రీనివాస్**



**మానకొండూర్, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో నే విద్యార్థులకు మంచి విద్య లభిస్తుందని, పేద ప్రజలు ప్రభుత్వ విద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మానకొండూరు మండల విద్యాధికారి రాపెల్లి శ్రీనివాస్ కోరారు. గురువారం మానకొండూరు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో వెల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరుగుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలను చేర్పించాలని ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి రాపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ అన్నారు. ప్రభుత్వ పాఠశాల చదువుకునే విద్యార్థులకు మంచి విద్యతోపాటు క్రమశిక్షణ అందిస్తున్నామని తెలిపారు. తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి వారి ఫీజుల దోపిడీకి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. అనంతరం గ్రామ ఉపసర్పంచ్ రాపాక ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాల చదువుకునే విద్యార్థుల ను ప్రోత్సహించే విధంగా ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ సైకిలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, యూనిక్ పాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.




## వరి రకాల సాగుకే బోనస్

**- వ్యవసాయ శాఖ సూచన**

**పాల్వంచ టౌన్, జూన్ 11,ప్రభాతవార్త:** వానకాలం2026 సాగు సీజన్‌లో రైతులు సన్నధాన్యం ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో వ్యవసాయ శాఖ కీలక సూచనలు జారీ చేసింది. ఈ సీజన్‌లో ఎంపిక చేసిన ఎనిమిది వరి రకాలను మాత్రమే సాగు చేయాలని రైతులకు సూచించింది. ఈ రకాలను సాగు చేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వర్తిస్తుందని అధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖ సూచించిన వరి రకాలు బీపీటీ5204 (సాంబా మసూరి), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్15048), కేఎన్ఎం 1638, జైశ్రీరామ్, హెచ్ఎంటీ (సోనా), డబ్ల్యూజీఎల్962, డబ్ల్యూజీఎల్44 (సిద్ది), జేజీఎల్1798. ఈ రకాలు మార్కెట్‌లో మంచి డిమాండ్ కలిగి ఉండటంతో పాటు రైతులకు అధిక ఆదాయం అందించే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. దొడ్డ ధాన్యం సాగును తగ్గించి సన్నధాన్యం సాగును ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సూచించిన రకాలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ కోరింది. “సన్నం ధాన్యం పండించండి - అధిక లాభం పొందండి, దొడ్డు ధాన్యం వద్దు - సన్నధాన్యం ముద్దు“ అనే నినాదంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుని వ్యవసాయ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రమాదకరంగా “వాగొడ్డుతండా వంతెన”

**- తక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కృష్ణ విజ్ఞప్తి**

**జూలూరుపాడు, ప్రభాతవార్త, జూన్ 11:**



మండల పరిధిలోని మాచినేనిపేట గ్రామ పంచాయతీ వాగొడ్డుతండా గ్రామ సమీపంలో వాగుపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు పొంగి ప్రవహించింది. ప్రతి ఏటా వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వాగుపై ఉన్న వంతెన బలహీనపడింది. ఈ నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా గత ఏడాది వంతెన పూర్తిగా దెబ్బతిన్నది. అదే సమయంలో వాగొడ్డుతండా గ్రామంలోకి ఓ ట్రాక్టర్ వంతెనపై నుంచి వెళుతుండగా ఒక్కసారిగా వంతెన కుంగిపోయింది. ఈ ఘటనలో ప్రాణాపాయం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టడంతో రాకపోకలకు అనుకూలంగా మారింది. ఈ వంతెన పైనుంచి ఆ ప్రాంత గ్రామ ప్రజలు రాత్రింబవళ్లు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలం సీజన్ కావడంతో దెబ్బతిన్న వంతెన వద్ద రాకపోకల సమస్య తలెత్తే అవకాశం ఉంది. వాగుకు వరద ప్రవాహం పోటెత్తితే వంతెన పైనుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. అంతేగాక వాగొడ్డుతండా గ్రామ ప్రజలు గ్రామం నుంచి బయటకు రావడానికి కూడా వీలుపడదు. రాత్రి కురిసిన భారీ వర్షానికి వంతెన వద్ద గత ఏడాది తాత్కాలికంగా చేసిన మరమ్మత్తులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వంతెన వద్ద లోతైన గోతులు ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ బానోతు కృష్ణ ప్రమాదకరంగా మారిన వంతెన ప్రాంతాన్ని సందర్శించి, ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత యంత్రాంగానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# మధిర బార్లలో బెల్టుదుకాణాలలో టీనేజర్లు

**- గంజాయి బ్యాచ్‌లు బరాబర్**

**- నిర్మూలన చర్యలు మృగ్యం**

**- ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన యంత్రాంగాలు**

భావిభారత పౌరులుగా దేశ భవిష్యత్తుకు పునాదులుగా నిలవాల్సిన యువత టీనేజర్లు గానే మద్యం మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు... విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ షాపులు హంగులతో ఏర్పాటుచేసిన బార్ అండ్ రెస్టారెంట్లు యువత కు మద్యం సేవించి ఎందుకు అడ్డాలుగా మారడం చర్చనీయాంశంగా మారింది... దీనికి తోడు విచ్చలవిడిగా విక్రయాలతో పాటు సేవనకు బానిసలుగా మారిన క్రమంలో గంజాయి ఆనవాళ్లు పట్టణంలో పరిసర గ్రామ ప్రాంతాల్లో యువత భవిష్యత్తు గతిని మార్చేందుకు వేదికలుగా అడ్డాలుగా మారుతున్నాయి అంటే అతిశయోక్తి కాదేమో... చట్ట పరిధిలోని అంశాలు నిర్మూలన కోసం ప్రభుత్వం చేస్తున్న తాపత్రయం క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన యంత్రాంగాలు నిమ్మకు నీరెత్తినట్లుగా మమః అనే రీతిలో ప్రచారాలకు మాత్రమే పరిమితం అవుతుండడం విధి నిర్వహణ బాధ్యతల డొల్లతనాన్ని వెల్లడిస్తోంది..



**మధిర జూన్ 11 ప్రభాతవార్త:**

దినదిన అభివృద్ధి చెందుతున్న మధిర పట్టణం అదే అదే క్రమంలో భావిభారత పౌరులుగా అడుగులు వేయాల్సిన యువతకు ఆదిలోనే హంసపాదుగా మత్తు పదార్థాలకు మద్యానికి బానిసలుగా మారేందుకు పరోక్షంగా దోహదపడుతుందన్న ఆక్షేపణాలు విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రధానంగా మధిర పట్టణ కేంద్రం లోని పలు ప్రాంతాలు గ్రామీణ ప్రాంతాలలో గంజాయి విక్రయాలు వాటికి బానిసలుగా మారిన యువతను మరింత ప్రభావితం చేస్తున్న క్రమంలోనే ఎక్సైజ్ శాఖ అనుమతులతో ఏర్పాటు చేసిన మద్యం షాపులు బార్ అండ్ రెస్టారెంట్లు ఎటువంటి అనుమతులు లేకుండా పరోక్ష ప్రభుత్వం ఆదాయ వనరుగా మారుతూ విచ్చలవిడిగా ఏర్పాటు అవుతున్న మద్యం బెల్ట్ షాపులు యువతకు అడ్డాలుగా మారుతున్నాయి.

**- నిబంధనలు పట్టని వైనం**

గంజాయి విక్రయాలు చాటుమాటుగా కొనసాగుతున్నా, మద్యం విక్రయాలకు సంబంధించి మైనర్లకు మద్యం విక్రయాలు చేయకూడదన్న పటిష్టమైన నిబంధనలు అమలులో ఉన్న వాటిని పట్టించుకున్న దాఖలాలు ఎక్కడ కనిపించవు. బెల్ట్ షాపులలో అయితే అసలు ఈ నిబంధన ఆనవాళ్లు కనిపించవు. ఏ టైంలో పడితే ఆ టైంలో 24 గంటలు అందుబాటులో మద్యం విక్రయాలకు అడ్డాలుగా బెల్ట్ షాపులు నిలుస్తుండడంతో ప్రధానంగా వీటిపైనే మైనర్లు యువత దృష్టి కేంద్రీకరించి మద్యం సేవిస్తుండడం అనేక సందర్భాల్లో గ్రూపులుగా విడిపోయి కొట్లాడుకున్న సంఘటనలు వెలుగు చూస్తున్నప్పటికీ చిన్న విషయాలుగా పట్టి పట్టనట్లు నియంత్రణ పర్యవేక్షణ యంత్రంగాలు వ్యవహరిస్తుండడం పై ప్రజల నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి.

**- మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రచార ఆర్భాటాలే**

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన గంజాయి మత్తు పదార్థాల నిర్మూలనపై సంబంధిత శాఖలు ప్రచారాలకే పరిమితం అవుతున్నాయి అన్న విమర్శలు మెండుగా ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ ఆదాయ వనరులపై తప్ప ఇతర బాధ్యతలపై దృష్టి కేంద్రీకరించిన దాఖలాలు మృగ్యమే అనేది జగమెరిగిన సత్యం. అదే క్రమంలో ఇతర శాఖలు కూడా బాధ్యతాయుతమైన పాత్రను నిర్వహించడంలో వైఫల్యం చెందుతున్నాయని చెప్పేందుకు పట్టణంలో పలు గ్రామాల్లో ఇప్పటికీ విచ్చలవిడిగా కొనసాగుతున్న మత్తు పదార్థాల విక్రయం సేవనం ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ తో పాటు పోలీస్ శాఖ ఈగల్ టీం ఇతర అధికార యంత్రాంగాలు మధిరను మత్తురహిత ప్రాంతంగా మార్చడం ద్వారా యువతకు భవిష్యత్తును అందించేందుకు దోహదపడేలా చర్యలు తీసుకోవాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

## ఎస్‌బీఐ ఫౌండేషన్ ప్రతినిధుల గ్రామ సేవ ప్రాజెక్టు పర్యవేక్షణ

**బోనకల్, ప్రభాతవార్త:**

ఎస్‌బీఐ ఫౌండేషన్ వారి సహకారంతో భవిష్య భారత్ సంస్థ అమలు చేస్తున్న "గ్రామ సేవ" ప్రాజెక్టు కింద బోనకల్ మండలంలోని కలకోట, రాయన్నపేట, మోటమర్రి, అల్లపాడు మరియు ఏ. గోవిందపురం (ఏ)గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి మరియు సేవా కార్యక్రమాలను ఎస్‌బీఐ ఫౌండేషన్ ప్రతినిధులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఫౌండేషన్ ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన సీనియర్ సిఎస్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ జి. దేబాజని భవిష్య భారత్ ప్రధాన కార్యాలయం నుండి సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ పి. రాజశేఖర్ , ప్రోగ్రామ్ మేనేజర్ సి. హెచ్. వినయ్ గ్రామాలను సందర్శించి రైతులు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామాల్లోని సమస్యలు, అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించారు. అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు అత్యధిక ప్రయోజనం



చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించాలని వారు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను తెలుసుకొని వాటి ఆధారంగా పనులు చేపట్టడం ద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాయన్నపేట గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన భవిష్య భారత్ ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులు, రైతుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న కాలువ పునరుద్ధరణ (కెనాల్ రీస్టోరేషన్) పనుల గురించి ఎస్‌బీఐ ఫౌండేషన్ మరియు భవిష్య భారత్ ప్రతినిధులు కమిటీ సభ్యులకు వివరించారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం..

### రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డిమాండ్...

**ఇల్లందుకుంట, ప్రభాతవార్త :**

రైతు భరోసా నిధులు చెల్లించకుండా, రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో రాము మాట్లాడుతూ వర్షాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చిన రైతు భరోసా నిధులను ఇప్పటివరకు విడుదల చేయకపోవడం రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. రైతులు ప్రస్తుతం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే కీలక సమయంలో ఉన్నారని, రైతు భరోసా నిధులు అందకపోవడంతో సాగు పనులు ఆలస్యమవుతున్నాయని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో



కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి ..15,000 రైతు భరోసా అందజేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో ఎకరానికి ..15,000 చొప్పున రైతు భరోసా నిధులను జమ చేయాలని, వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని కోరారు. రైతాంగ సమస్యలను పరిష్కరించకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




## మధిరలో క్వింటా రూ.22వేలు పలికిన మిర్చి

**మధిర జూన్ 11 ప్రభాతవార్త :**



మధిర వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు మిర్చి కొనుగోళ్లను గురువారం ఏఎంసీ చైర్మన్ బండారి నరసింహారావు ప్రారంభించారు. మొదటి రోజు కొనుగోళ్ళలో అత్యధికంగా రవి కుమార్ అనే రైతుకు చెందిన తేజ రకం మిర్చి 18 బస్తాలు క్రిష్ణా అనే ట్రేడర్ రూ. 22వేల రేటుకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ,మధిర వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను రెగ్యులర్ మార్కెట్ యాడ్ గా మార్చేందుకు ఇప్పటికే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హామీ ఇవ్వడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఈ యార్డ్ లో రైతులు పండించిన పంట నిరంతర క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయ్ కుమార్, తలుపుల వెంకటేశ్వర్లు, ఎర్రుపాలెం మండల అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు,పులిబండ్ల చిట్టిబాబు,కోల్డ్ స్టోరేజ్ యజమానులు మందడపు రామకృష్ణ,కళ్యాణపు పుల్లారావు,కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం మరియు ట్రేడర్స్ తదితరులు పాల్గొన్నారు..

## బడిబాటలో ఉపాధ్యాయులు...

**జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త:**

హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయ బృందం రెండు విభాగాలుగా విడిపోయి ఒక విభాగం వారు విలాసాగర్ గ్రామంలో మరొక విభాగం వారు సైదాబాద్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బడి ఈడు వయసున్న పిల్లలందరినీ జడ్.పి.హెచ్.ఎస్ కోరపల్లి పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని, ఉచిత మధ్యాహ్న భోజనము, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోటు పుస్తకాలు, ఉచితంగా అమ్మాయిలకు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కరాటే శిక్షణ, ఆటలలో శిక్షణ మరెన్నో కార్యక్రమాలు ఉచితంగా అందుతున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పి. రాజయ్య, పెండెం శ్రీనివాస్ ,ఆవాల నరహరి, పి.రాజు, సి. రవి కాంత్ రాజు, విజేందర్ రెడ్డి మరియు క్రాఫ్ట్ ఇన్స్ పెక్టర్ శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.



# అధిక ఫీజుల వసూళ్లను తక్షణమే నియంత్రించాలి

కొత్తగూడెం టౌన్, జూన్ 11 ప్రభాతవార్త:

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో సాగుతున్న అధిక ఫీజుల దోపిడీని తక్షణమే అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏడీఈఓ శ్యామ్ ప్రసాద్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే షాహిద్, వరక అజిత్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రైవేట్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుండి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో దందా సాగిస్తున్న కార్పొరేట్ స్కూళ్లపై విద్యాశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పాఠశాలల్లోనే పాఠ్య పుస్తకాలు, టై, బెల్ట్, యూనిఫాం, షూలను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యను పూర్తి వ్యాపారంగా మార్చేశారని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమని, ఇక్కడి పేద, మధ్యతరగతి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి యథేచ్ఛగా సాగుతున్న విద్యా



వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని, విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు ఇనపల్లి పవన్ సాయి, మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, సంఘం నాయకులు కళ్యాణ్, నవీన్, మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి ఏఎండీఆర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

పాల్వంచ, జూన్ 11, ప్రభాతవార్త:

మహిళల అభ్యున్నతి,ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్న ఆదిల్ నేతృత్వంలోని ఏఎండీఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంఎస్ మాజీ చైర్మన్,పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.గురువారం కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర కళాశాల ఆవరణలో ఏఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఉచితంగా నిర్వహిస్తున్న సౌందర్య శిక్షణ కోర్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల సాధికారతకు స్వచ్ఛంద సంస్థలు మరింత ముందుకు రావాలని సూచించారు.సమాజంలోని పేద,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆదిల్ నిరంతరం కృషి చేస్తున్నారని,ఆయన సేవా కార్యక్రమాలు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే




విధంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమం వారికి ఆర్థికంగా తోడ్పడుతుందని అన్నారు.కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,శ్రీ రామచంద్ర కళాశాల అధ్యాపకులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్దమ్మగుడిలో ఘనంగా సువర్ణ పుష్పార్చన..

**- 12న నందీశ్వరస్వామికి అభిషేకం, 13న రుద్రహోమం**

పాల్వంచ, జూన్ 11, ప్రభాతవార్త :

కేశవాపురంజగన్నాథపురం గ్రామ పరిధిలోని శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో గురువారం అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.రజనీకుమారి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర సేవలు నిర్వహించారు.అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు,భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ నెల 12వ తేదీన ఆలయ ఆవరణలోని శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో నందీశ్వరస్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, నీరాజన మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు ప్రదోషకాలంలో ఈ పూజలు జరగనున్నాయని,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.అలాగే ఈ నెల 13వ తేదీన మాసశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు యాగశాలలో రుద్రహోమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హోమంలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవచ్చని



తెలిపారు. పాల్గొనే దంపతులకు శేషవస్త్ర ప్రసాదం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రత్యక్షంగా హాజరు కాలేని భక్తుల పేర్లతో సంకల్పం చేసి హోమం నిర్వహిస్తామని తెలిపారు.అదే రోజు శనిత్రయోదశి సందర్భంగా శనిశ్వరునికి తైలాభిషేకం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జన్మనక్షత్ర,నామదోషాలు ఉన్నవారు ఈ పూజలో పాల్గొనడం ద్వారా శని దోషాల నివారణతో పాటు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలుగుతాయని విశ్వాసమన్నారు.పూర్తి వివరాలకు 6303408458 నంబర్‌ను సంప్రదించాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎఎండిఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**- రామచంద్ర కళాశాలలో ఉచిత బ్యూటీషన్ క్లాసులు**

**- క్లాసులు ప్రారంభించిన మేయర్ గణేష్**

లక్ష్మీదేవిపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:

ఎఎండిఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఛేంజ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ అన్నారు. గురువారం శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో మూడు నెలల ఉచిత బ్యూటీషన్ క్లాసులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది మహిళలకు మూడు నెలల పాటు స్వయం ఉపాధి కల్పించడానికి ఈఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప కార్యక్రమమన్నారు. మహిళలు బ్యూటీషన్ కోర్సుల్లో నూతన ఒరబడి నేర్చుకోవడానికి ఈ క్లాసులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈశిక్షణ తీసుకుంటున్న ప్రతి ఒక్క మహిళ




బ్యూటీసియన్ మెళకువలను నేర్చుకోని ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ అది, కోఫౌండర్ డాక్టర్ సాయి ప్రసన్నలను అభినందించారు. ఈ కార్య కమంలో డిప్యూటీమేయర్ లలితకుమారి, లక్ష్మీదేవిపల్లి ఎసాచి రమణారెడ్డి, షీటీం ఎస్ఐ రవ నాదేవి, టీపీసీసీ సెక్రటరీ నాగా సీతారాములు, కార్పొరేటర్లు ఎస్.సుగుణ, భవిత, సరిత, సుప్రియ ఏఐవైఎఫ్ డివిజన్ సెక్రటరీ ఫహీందాదా, కొత్వాల శ్రీనివాసరావు, ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మ, వైస్ ప్రిన్సిపల్ పూర్ణచందర్రావు, సర్పంచ్ అజ్మీరా లైలా, కిన్నెర వెంకన్న, అభిలాష్, గౌతమ్, నందు, కృష్ణ ప్రణయ్, బ్యూటీషన్లు తదితరులు పాల్గొన్నారు.




**చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్**

# సింగరేణిలో రాజకీయ జోక్యంతో కార్మికులకు తిప్పలు

**- పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి..**

**- అవసరమైతే నిరవధిక సమ్మెకు సిద్ధం: ఏఐటీయూసీ హెచ్చరిక**

కొత్తగూడెం, జూన్ 11 ప్రభాతవార్త:



సింగరేణి సంస్థలో కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ జోక్యమే ప్రధాన కారణమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు ఆరోపించారు. గురువారం సాయంత్రం శేషగిరిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి మాట్లాడుతూ... కార్మిక సంక్షేమం, సంస్థ అభివృద్ధి, భవిష్యత్ ఉద్యోగ అవకాశాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సింగరేణి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటోందని విమర్శించారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులు, అలియాస్ పేర్ల మార్పు, పెర్క్‌పై ఆదాయపు పన్ను తొలగింపు, సొంత ఇంటి స్థలాల కేటాయింపు వంటి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, యాజమాన్యం నిరక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయని పేర్కొన్నారు. పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ ఆచరణలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండగా, రాజకీయ జోక్యం కారణంగా ఆ ప్రక్రియ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం అవుతోందని ఆరోపించారు. దీంతో వందలాది మంది డిపెండెంట్లు ఉద్యోగాల్లో చేరకుండా నిరీక్షించాల్సి వస్తోందని, రిటైర్డ్ కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఉద్యోగంలో చేరాల్సిన సమయాన్ని కోల్పోవడం వల్ల డిపెండెంట్లు విలువైన సర్వీస్‌తో పాటు నెలల తరబడి వేతనాలను కూడా కోల్పోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ నిధులు అందకపోవడం వల్ల సంస్థ అభివృద్ధి కార్యక్రమాలు, ఆధునీకరణ పనులు, కొత్త పెట్టుబడులు తీవ్రంగా ప్రభావిత మవుతున్నాయని తెలిపింది. ఒకవైపు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలని ఒత్తిడి తెస్తూ, మరోవైపు సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించకపోవడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. సింగరేణి భవిష్యత్తుకు కీలకమైన కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు, కొత్త బొగ్గు గనుల ప్రారంభం, ఉద్యోగ అవకాశాల విస్తరణ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం మోనం పాటిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ విస్తరణ లేకుంటే భవిష్యత్ తరాలకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయని హెచ్చరించారు. యూనియన్‌తో జరిగిన అధికారిక సమావేశాల్లో అంగీకరించిన అనేక డిమాండ్లను కూడా రాష్ట్ర ప్రభుత్వ జోక్యం కారణంగా యాజమాన్యం అమలు చేయడం లేదని మండిపడ్డారు. సింగరేణిలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కార్మిక వర్గం ఇక మోనంగా ఉండబోదని స్పష్టం చేసిన ఏఐటీయూసీ నాయకులు, అవసరమైతే నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్మికుల హక్కులు, సింగరేణి భవిష్యత్ పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటానికి అన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, కార్మికులు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్లు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శులు గట్టయ్య, రాము, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, నాగయ్య, నితిన్, పిట్ కార్యదర్శులు ఎం.ఆర్.కే. ప్రసాద్, కమల్, రమేష్, సీనియర్ నాయకులు లక్ష్మీ మ్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడిని ఖండిస్తూ తెలుగు మహిళల నిరసన ర్యాలీ

**ఖమ్మం అర్బన్, జూన్ 11(ప్రభాతవార్త):**
ఖమ్మం నగరం రాపర్తినగర్ ప్రాంతంలో 12ఏళ్ల మైనర్ బాలిక పై లైంగిక దాడి ఆపై హత్యాయత్నం చేసిన ఉన్మాది గౌస్ పాషాని చట్టపరంగా శిక్షించాలని కోరుతూ, బాదితురాలికి న్యాయం చేకూరేలా ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆకాంక్షిస్తూ తెలుగు మహిళ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు, ముందుగా తెలుగుదేశంపార్టీ కార్యాలయం నుంచి తెలుగుమహిళల ఆధ్వర్యంలో ప్లకాడు పట్టుకుని పాదయాత్రగా ఉన్మాదిని వెంటనే కఠినంగా శిక్షించాలని వి వాంట్ జస్టిస్ అంటూ ఎన్టీఆర్ సర్కిల్ లో రాస్తారోకో చేసి శాంతియుతంగా నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాళ్ళు రాచకొండ పావని, కామ అనిత, రంగిశెట్టి మంగమ్మ, తాడిశెట్టి స్వాతి, సౌలం లావణ్య, కూరపాటి సంధ్య,



వీరితోపాటుటిడిపి జిల్లా నాయకులు హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, వడ్డేం విజయ్, నున్నా నవీన్, కూచిపూడి జై, చింతనిప్పు నాగేశ్వరరావు,నల్లమల రంజిత్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.




# గిరిజనుల ప్రగతికి ఐటీడీఏ కృషి అభినందనీయం

**- టీజీఐఆర్డి హెడ్ సుభాష్ చంద్ర గౌడ్**

**భద్రాచలం,ప్రభాతవార్త:**
ఆదివాసి గిరిజన మహిళలు రైతులకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రారంభించిన భద్రగిరి మార్ట్,ట్రైబల్ మ్యూజియం మరియు కోయ ఇలవేల్పుల చరిత్ర ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని టీజీ ఆర్ ఐ డి సమావేశ మందిరములో తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ ప్రాంతాలలో పీసా చట్టం అమలుపై నిర్వహిస్తున్న వర్క్ షాప్ లో వివిధ శాఖలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో రూపొందించిన గిరిజన కల్చర్ కు సంబంధించిన మ్యూజియం, భద్రగిరి మార్ట్ మరియు కోయ ఇలవేల్పుల చరిత్ర గురించి సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ వర్క్ షాప్ లో పాల్గొన్న పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ, వివిధ లైన్ శాఖ అధికారులు, సర్పంచులకు వివరించారు. అనంతరం భద్రగిరి మార్ట్ కి సంబంధించిన నిత్యవసర సరుకులను టి జి ఐ ఆర్ డి హెడ్కు అందించిన అనంతరం సుభాష్ చంద్ర గౌడ్ మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆదివాసి గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కట్టుబాట్లు నేటితరం యువతీ యువకులకు తెలిసేలా గిరిజన మ్యూజియం రూపొందించడం చాలా బాగుందని, గిరిజనుల గోత్రనామాలు వారి గట్లు తెలిసే విధంగా ఇలవేల్పుల చరిత్ర రూపొందించి నేటితరం



ఆదివాసి గిరిజనులకు తెలియజేయడం చాలా సంతోషకరమని అలాగే గిరిజన మహిళలకు రైతులకు ఆర్థికంగా చేయూత అందించడానికి, వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి భద్రాచలంలో భద్రగిరి మార్ట్ నెలకొల్పి వారు తయారు చేసిన నిత్యవసర సరుకులను మధ్య దళారుల పాలు కాకుండా కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా వెసులుబాటు కల్పించిన ఐటీడీఏ పీవో బి రాహుల్ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు. ఐటీడీఏ పీవో గిరిజన సంక్షేమానికి పాటుపడుతున్న విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన గ్రామాలలో గిరిజనుల కోసం పనిచేస్తున్న అధికారులు అమలు చేస్తే గిరిజనులు ఆర్థికంగా బలోపేతమై వారి కుటుంబాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోషించుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసా అధికారి అశోక్ మరియు తెలంగాణ ఆదివాసి గిరిజన గ్రామాలలోని సర్పంచులు మరియు ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం

**భద్రాచలం కల్చరల్,ప్రభాతవార్త :**



భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం కన్నుల పండువగా సాగింది. అర్చక స్వాములు వేకువ జామునే దేవస్థానానికి చేరుకుని శ్రీస్వామి వారి ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ, విశ్వక్సే న ఆరాధన, పుణ్యాహవచనం తంతును నిర్వహించారు. ముందుగా పవిత్ర గౌతమీ నదీ నుండి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ తీర్థపు బిందెలో జలాలను తీసుకుని వచ్చి శ్రీస్వామి వార్ల మూలవరులకు అభిషేకాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం శ్రీస్వామి వారి ఉత్స వమూర్తులలో శ్రీస్వామి వారిని ఆవాహనం చేసి భక్తుల జయ జయ ధ్వానాల నడుమ బేడా మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకస్వాములు కళ్యాణ తంతు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా అర్చక స్వాములు శ్రీస్వామి వారి సహస్త్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహాత్యాన్ని భక్తులకు వివరించారు. కళ్యాణతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సే నపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోత్రధారణ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహా సంక ల్పం, మంగళాష్టకాలు, చూర్ణీత, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్యధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణం జరుగుతున్నంత సేపు భక్తజనులంతా కళ్ళార్పకుండా చూస్తూ తరలించారు. కళ్యాణంలో పాల్గొన్న వారికి దేవస్థాన సిబ్బంది కళ్యాణలడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.



# ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**- ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి**

**భద్రాచలం క్రైమ్, ప్రభాతవార్త :**
భద్రాచలం పట్టణంలో వాహనదారులకు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం పట్టణంలోని ప్రధాన కూడలి అయిన యూబి రోడ్డులో ఆయన సిబ్బందితో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా, అడ్డంగా పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను, రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్లను ట్రాఫిక్ పోలీసులు అక్కడి నుండి తొలగించారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ... పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి వాహనదారులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

తోపుడు బండ్ల నిర్వాహకులు కేటాయించిన స్థలాల్లోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలను నోపార్కింగ్ జోన్ లలో నిలపరాదని హెచ్చరించారు. ఎవరైనా ట్రాఫిక్ నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు తప్పవని ఆయన



స్పష్టం చేశారు. ట్రాఫిక్ పోలీసుల ఈ చర్య పట్ల స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐ వెంట ఏ ఎస్ ఐ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోచమ్మ దేవాలయం, సెక్యూరిటీ రూమ్‌కు, వైరింగ్ ఏర్పాటు చేయాలి: ఎఐటీయూసీ

**సత్తుపల్లి జూన్ 11ప్రభాతవార్త:**
సత్తుపల్లి పీవీ నరసింహారావు సెంటెనరీ కాలనీ (సింగరేణి క్వార్టర్స్)లో నిర్మించిన పోచమ్మ దేవాలయానికి, అలాగే సెక్యూరిటీ రూమ్‌కు హౌస్ వైరింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎఐటీయూసీ నాయకులు ఎస్ఓ టు జీఎం బొల్లం శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కాలనీలోని పోచమ్మ దేవాలయం నిర్మించి సంవత్సరం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు శాశ్వత హౌస్ వైరింగ్ ఏర్పాటు చేయలేదని, ప్రస్తుతం తాత్కాలిక విద్యుత్ సరఫరాతోనే నిర్వహణ కొనసాగుతోందని వారు తెలిపారు. దీంతో భక్తులు, కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, కాలనీలో నిర్మించిన సెక్యూరిటీ రూమ్‌కు కూడా ఇప్పటి వరకు హౌస్ వైరింగ్ ఏర్పాటు చేయకపోవడంతో సెక్యూరిటీ సిబ్బంది విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. కావున పోచమ్మ దేవాలయం సెక్యూరిటీ రూమ్‌కు అవసరమైన హౌస్ వైరింగ్ పనులను తక్షణమే పూర్తి చేసి విద్యుత్ సౌకర్యాలు



కల్పించాలని గుర్తింపు సంఘం ఎఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. అదేవిధంగా కాలనీలో కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్ఓ టు జీఎంకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన, సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్, సహాయ కార్యదర్శి పి. సూర్యప్రకాశ్, జేవీఆర్ పిట్ కార్యదర్శి జి. నరసింహారావు, మైన్స్ కమిటీ సభ్యులు జి. బాలసుబ్రహ్మణ్యం, పి. నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం లొంగిపోయింది

- ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ భరో
- హామీలు అమలు చేయకపోతే సీఎం ఇల్లు ముట్టడిస్తాం
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన

కార్యదర్శి బి. వెంకట్

మణుగూరు, ప్రభాత వార్త, జూన్ 11:





కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లొంగిపోయిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఆయన గురువారం మణుగూరు పట్టణంలోని శ్రామిక భవన్ నుండి కిన్నెర కళ్యాణమండపం వరకు వందలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కామ్రేడ్ దేవులపల్లి యాకయ్య నగర్, కామ్రేడ్ గుగ్గిలో ధర్మ ప్రాంగణంలో అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా 4వ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.గతంలో సుదీర్ఘకాలం పాలించిన నెహ్రూ, ఇందిరాగాంధీలు ఎన్నడూ కార్పొరేట్లకు లొంగిపోలేదని అన్నారు. దేశంలోని 70 వేల కోట్ల వ్యవసాయ రంగాన్ని అమెరికా, యూరోపియన్ యూనియన్‌కు అమ్మేందుకు కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. దీనికి నిరసనగా, విదేశీ కార్పొరేట్లకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా ఖిజైల్ భరోఖి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. డిసెంబర్‌లో కర్ణాటకలో అఖిలభారత మహాసభలు, ఈ నెల 20 నుండి22 వరకు మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. రేవంత్ రెడ్డివి తుపాకీ రాముడు మాటలుఅని అన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ఫ్యూచర్ సిటీ అంటూ భ్రమలు కల్పిస్తున్నారని విమర్శించారు. పెన్షన్ల బకాయిలు 25 వేల కోట్లు, మహిళలకు ఇవ్వాల్సిన మహాలక్ష్మి పథకం బకాయిలు రూ. 1.40 లక్షల కోట్లు రేవంత్ ప్రభుత్వం ప్రజలకు బాకీ ఉందన్నారు. ఈ బకాయిలపై ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయకపోతే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.మతం మారారనే నెపంతో ఎస్సీ క్రిస్టియన్లకు రిజర్వేషన్లు రద్దు చేయడంపై సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ అన్యాయమైనదని, ఇది దేశంలో రాజ్యాంగానికి బదులు మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్రం చూస్తోందని, జీవో నెం. 3 ద్వారా ఆదివాసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, పోడు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల్లో సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్, వినోద, నిమ్మల వెంకన్న, గద్దల శ్రీనివాస్, సత్రపల్లి సాంబశివరావు, నరసింహారావు, కొమరం కాంతారావు, బొల్లం రాజు, నరేష్, సర్పంచ్ కుంజ రాజు, రమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.







## సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసిల్దార్‌గా రాజేశ్వరరావు

అశ్వాపురం,ప్రభాతవార్త, జూన్ 11:



అశ్వాపురం మండల డిప్యూటీ తహశీల్దార్ గా విధులు నిర్వర్తిస్తున్న మైపతి రాజేశ్వరరావు మణుగూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ గా బదిలీ అయ్యారు. గతంలో అశ్వాపురం తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గా మూడు సంవత్సరాలు, డిప్యూటీ తహశీల్దార్ గా నాలుగు నెలలు విధులు నిర్వహించి తమకంటూ మండలంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తిగా, మండలంలోని అందరితో స్నేహపూర్వక సంబంధాలు ఉన్న అధికారిగా గుర్తింపు పొందారు.ఎలాంటి సమస్యలైనా చాకచక్యంతో పరిష్కరించే అధికారిగా తనదైన శైలిలో విధి నిర్వహణలో సమస్యలు పరిష్కరిస్తూ,మండలంలో ప్రజలందరి మన్ననలు పొందారు.సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ గా బదిలీ అయిన వారు భవిష్యత్తు లో మరెన్నో ఉన్నతమైన చేపట్టాలని మండల ప్రజా ప్రతినిధులు,ప్రముఖులు ఆకాంక్షి ంచారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంచార్జ్

ప్రిన్సిపల్ డాక్టర్ వాల్యా

మణుగూరు, ప్రభాతవార్త, జూన్ 11:



మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో అడ్మిషన్ల క్యాంపెనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ వాల్యా మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వసతులను, విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వివిధ కొత్త కోర్సుల గురించి, వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ బాబు, లెక్చరర్లు నాగిరెడ్డి, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుతోనే రైతుకు మేలు

## మెగా రైతు మేళా

### ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం మంత్రి సీతక్క

గోవిందరావుపేట ప్రభాతవార్త:

రైతులు సంప్రదాయ సాగుతో పాటు ఆధునిక పద్ధతులు అవలంబించి ఉత్పాదకత పెంచుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.గురువారం మండలంలోని సోమలగడ్డ క్రాస్ వద్ద పీఎస్ఆర్ గార్డెన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి మెగా రైతు మేళాలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని సూచించారు. పంటల మార్పిడి ద్వారా భూసారం కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. అధిక రసాయనాల వాడకం అనర్థాలకు దారితీస్తుందని, సేంద్రియ పద్ధతులతో ఆరోగ్యకర జీవనం సాధ్యమని తెలిపారు.రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, రూ.21 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. రైతు భరోసాతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని, పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ములుగు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు వేల ఎకరాలకు విస్తరించిందని, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం ఇచ్చే ఈ పంటను రైతులు స్వీకరించాలని కోరారు. పోడు, బీడు భూముల్లో కూడా ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలు వేసుకోవచ్చని సూచించారు. పట్టాలు లేని రైతులకు కూడా పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని, సాంకేతికతతో ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ శాస్త్రీయ సాగుపై అవగాహనకు మెగా రైతు మేళాలు దోహదపడతాయని అన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల మార్పిడి, నూతన వంగడాలు, ఆధునిక యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మంత్రి సీతక్క ఉత్తమ రైతులను సన్మానించారు. వ్యవసాయ స్టాల్స్‌ను పరిశీలించి, నూతన వరి నాటు యంత్రాన్ని స్వయంగా నడిపారు.

## డైరీ చైర్మెన్ ఎన్నికపై డైరెక్టర్ల నిరసన

చిగురుమామిడి, ప్రభాత వార్త :



చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామ కరీంనగర్ డైరీ నూతన చైర్మన్ ఎన్నికలు గురువారం రోజున జరిగాయి. ఇట్టి ఎన్నికలపై ఇద్దరు డైరెక్టర్లు బోయిని అనిల్, చెంచల మొగిలి నిరసన వ్యక్తం చేశారు. వీరు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి చైర్మన్ గా మాకు అవకాశం ఇవ్వడం లేదని, చైర్మన్ గా ఉండడం మీ వల్ల కాదు, మీకు డైరీని నడిపే సత్తా లేదు అనే విధంగా కొంతమంది డైరెక్టర్లు తక్కువ చేసి కించపరిచే విధంగా మాట్లాడటం వల్ల మానసికంగా ఇబ్బంది పడి అక్కడి నుండి సంతకాలు చేయకుండానే వెను తిరిగి వచ్చేసినట్లు వారు తెలిపారు. ఈ లోగా చైర్మన్ ఎన్నిక వారే ఏకగ్రీవం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మాత్రమే గత కొన్నేళ్ల నుండి డైరీని వాళ్ళ ఆధీనం లోకి తీసుకొని నడుపుతున్నారని ఫలితంగా మాలాంటి వాళ్లపై కక్ష సాధిస్తున్నారని, పోటీలో ఉండకుండా గ్రూపులుగా ఏర్పడి చిన్న చూపు చూసి హేళన చేస్తున్నారని బోయిని అనిల్, చెంచల మొగిలి ఆరోపిస్తున్నారు. వీరి వెంట వీరయ్య, తిరుపతి ఉన్నారు.

## బిఎల్ఓ లపాత్రే కీలకం తాసిల్దార్ ఎంపీడీవో స్పష్టం..

తల్లాడ జూన్ 11 :ప్రభాతవార్త

ఎన్నికల సంఘం జారీ చేసిన కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా డాక్యుమెంట్ ధ్రువీకరణ తప్పనిసరి అని తాసిల్దార్ టీ కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బి ఎల్ ఓ లకు జిపిఓలకు గ్రామపంచాయతీ కార్యదర్శుల కు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో ఏ శ్రీధర్ రాజుతో కలిసి మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతంలో మార్గదర్శకాలు రూపొందిస్తుందని వివరించారు బిఎల్ఓ ల పాత్రే కీలకమని ప్రతి ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమం పై ఎప్పటికప్పుడుఅవగాహన పెంపొందించుకొని పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని అవగాహన లేకుండా గ్రామాల్లో తిరిగిన ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు మ్యాపింగ్ విషయంలో పట్టు సాధిస్తే కార్యక్రమం సునాయాసంగా ముందుకు సాగుతుందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ మధు సిబ్బంది పాల్గొన్నారు

# వ్యవసాయ రంగంలో అపార అవకాశాలపై పూర్వ విద్యార్థి ఉపన్యాసం

*అశ్వారావుపేట రూరల్, జూన్ 11 ప్రభాతవార్త:*

స్థానిక వ్యవసాయ కళాశాలలో 1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి హరీష్ ఆర్వి "బి.ఎస్‌సి. (అగ్రికల్చర్) విద్యార్థులకు విస్తృతమైన అవకాశాలు" అనే అంశంపై గురువారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ



సందర్భంగా హరీష్ ఆర్వి వ్యవసాయ రంగంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అనేక ఉద్యోగ, వ్యాపార, పరిశోధన, అభివృద్ధి అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. వ్యవసాయ పట్టభద్రులు తమ వృత్తి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ప్రవర్తనా నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, మేనేజీరియల్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇతరులతో కాకుండా మీతో మీరు పోటీ పడండి" అని ప్రేరణనిచ్చారు. అలాగే "వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట శ్రీహరికోట లాంటిది. ఇక్కడి నుంచి విద్యార్థులు రాకెట్‌లా ఉన్నత శిఖరాలను అధిరోహించడం వారి సంకల్పం, కృషిపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం డాక్టర్ హేమంత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించగా డాక్టర్ శిరీష, శ్రావణ్ కుమార్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చర్ల గట్టు నెంబర్ రహదారికి మహర్దశ

## దశాబ్దాల రహదారి సమస్యకు పరిష్కారం మరమ్మతు పనులు ప్రారంభించిన సర్పంచ్ జాయ్ లూసీ

*కామేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:*

కామేపల్లి మండలం ముచ్చర్ల గట్టు నెంబర్ భూములకు వెళ్లేందుకు సరైన రహదారి లేక అన్నదాతలు దశాబ్దాలుగా ఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల ప్రారంభ సీజన్‌లో రైతులు దారి సమస్యతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైతుల కష్టాలను గుర్తించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం స్పందించింది. పంచాయతీ సాధారణ నిధులతో రహదా రి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. గురువారం సర్పంచ్



జాటోత్ జాయ్ లూసీ రహదారి మరమ్మతు పనులను ప్రారంభించారు. దశాబ్దాల కల నెరవేర నుండడంతో గట్టు నెంబర్ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారి పూర్తయితే వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, యం త్రాల తరలింపునకు ఇబ్బందులు తొలగి పోతాయని అన్నదాతలు ఆనందం వ్య క్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేగళ్ల ఉమ , వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తీర్థాల చిదంబర రావు, శతకోటి స త్యనారాయణ, కోల లక్ష్మీ ృనారాయణ, కోల వెంకటేశ్వర్లు, ప్రభాకర్ రావు, శతకోటి హనుమంతరావు, తూము వెంకటేశ్వర్లు త దితరులు పాల్గొన్నారు.



# సాయిబాబ ఆలయానికి రిక్షా వితరణ

*దమ్మపేట, జూన్ 11 ప్రభాతవార్త:*

మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న సాయిబాబా ఆలయానికి మాజీ ఎంపీటీసీ దేవరపల్లి అజయ్ కుమార్ తన సొంత ఖర్చులతో రిక్షాను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట




నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు స్థానిక బిఆరఎస్ నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ట్రస్ట్ వారికి రిక్షాను అందజేశారు. ఈ సందర్భంగా మెచ్చా మాట్లాడుతూ సాయిబాబా ఆలయ అవసరాలకు, స్వామివారి నిత్య సేవలకు ఈ రిక్షా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ముందుకొచ్చి స్వచ్ఛందంగా రిక్షాను బహూకరించిన ఎంపిటిసి దేవరపల్లి అజయ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కాసిని శ్రీను, వెలుగోటి మహేష్, అబ్దుల్ జిన్నా, దండాబత్తుల కాంతారావు, దొద్దుల వెంకన్న, మడిపల్లి పోలరాజు, కొండ్రముచ్చు నాగరాజు, కోళ్ళ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో న్యాయసేవా అధికార కమిటీ సమావేశం

*దమ్మపేట, జూన్ 11 ప్రభాతవార్త:*

దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం మండల న్యాయ సేవా అధికార కమిటీ సమావేశంను స్థానిక జూనియర్ సివిల్ కోర్టు కమ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జి బి భవాని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ భవాని మాట్లాడుతూ జీవితంలో




వెళ్ళకూడనివి రెండు ప్రదేశాలు ఏమిటంటే పోలీస్ స్టేషన్, కోర్టు అని అన్నారు. పోలీస్ స్టేషన్ లో ఎఫ్.ఐ.ఆర్ నమోదు అయ్యి కోర్టు కెళ్ళే విషయంలో చిన్న చిన్న విషయాలకు కేసులు పెట్టుకునే పరిస్థితి తగ్గించుకుంటే మానసికంగా ఒత్తిడి తగ్గించుకున్న వారు అవుతారు అని అన్నారు. తప్పు చేసిన వారు పతనం అవుతారు అదే వారికి పెద్ద శిక్ష అన్నారు. 3 నెలలకు ఒకసారి లోక్ అదాలత్ నిర్వహిస్తాం అన్నారు. జూన్ 20 న నిర్వహించే లోక్ అదాలత్ లో రాజీ అయ్యే కేసులు కానీ, చిన్నపాటి ఫైన్ లతో అయ్యే కేసులు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను లైంగికంగా దురుద్దేశ్యంతో వారిని తాకిన, మరి ఏ ఇతర పనులు చేపట్టినా వారి పై పెద్దలకు మాత్రమే కాకుండా మైనర్లకు కూడా పోక్సో కేసు నమోదు అవుతుందన్నారు. దీనికి బాధితురాలి తల్లి తండ్రులు కూడా అవసరం ఉండదు అని బాధితరాలు చెప్పిన సాక్ష్యంతో కేసు నమోదు అవుతుందన్నారు. అనంతరం దమ్మపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గొంది మురళి మోహన్ మాట్లాడుతూ దమ్మపేట కోర్టు రావడంలో రాజేంద్ర ప్రసాద్ చేసిన సేవలను గుర్తు చేశారు. లీగల్ సర్వీస్ తీసుకురావడంలో జడ్జి భవాని కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, అదనపు సబ్ ఇన్స్పెక్టర్ బాలస్వామి, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, దాసరోజు సరిత రామారావు, ఉయ్యాల లక్ష్మీ ృనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఉప సర్పంచ్ ను సన్మానించిన ఎమ్మెల్యే

*తల్లాడ జూన్ 8: ప్రభాతవార్త*

మండల పరిధిలోని మంగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమై దయానంద్ సర్పంచ్ ఉప సర్పంచ్ ను సన్మానించారు ఈ సందర్భంగా కార్యాలయాన్ని కలియతిరిగి పాలకవర్గాన్ని అభినందించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి నాగ నరసింహారావు ఉపసర్పంచ్ చింటూ ఎంపీడీవో ఎస్ శ్రీధర్ రాజు సర్పంచులు మోనిక గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు






# అత్యాచారానికి పాల్పడిన దోషినీ కఠినంగా శిక్షించాలి

*దమ్మపేట రూరల్ జూన్ 11 ప్రభాతవార్త :*

ఖమ్మంలో చిన్నారిపై జరిపిన హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షి ంచాలని బిజెపి పార్టీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖమ్మం నగరంలో



మానవత్వాన్ని మంటగలిపేలా, అత్యంత పశుప్రవృత్తితో ఒక చిన్నారిపై హత్యాచార సంఘటన తీవ్ర దిగ్భ్రాంతిని, మానసిక క్షోభను కదిలించిందని, పసిపాపను భవనం పైనుంచి కిందకు తోసి హత్య చేసిన తీరు సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తు సమాజంలో మహిళలు, ముఖ్యంగా పసిపిల్లలపై జరుగుతున్న దారుణాలు, చట్టాల అమలు రాష్ట్ర ప్రభుత్వం తీరుపై రక్షణ వ్యవస్థలపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయని అమాయకపు చిన్నారి ప్రాణాలను బలిగొన్న ఈ ఘటనలో నిందితుడిని వెంటనే కఠినంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు కారం రత్నకుమారి, ఆళ్ల సుజాత, తంబళ్ల నాగేంద్ర, బీజేపీ సీనియర్ నాయకులు గుడా ముత్యాలరావు, దారా నాగేశ్వరావు ,పూచి ప్రసాద్ ,దారా మోహన్ రావు, సత్యనారాయణ, భూషణం, సాయి, నాగు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడమే నా ధ్యేయం

## మంత్రులను కలిసి నియోజకవర్గ అభివ ద్ధికై వినతులు

## శాసనసభ్యులు జారే ఆదినారాయణ

*అశ్వారావుపేట రూరల్, జూన్ 11 ప్రభాతవార్త:*

అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడమే నా ధ్యేయమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే జారె ముందుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని కలిసి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వివిధ కీలక అభివృద్ధి పనులకు, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక బడ్జెట్ నిధులు కేటాయించాలని కోరారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కని కలిసి ఏజెన్సీ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారం, గ్రామీణ ప్రగతి నిధుల మంజూరుకై విజ్ఞప్తి చేశారు. మంత్రి అజహరుద్దీన్‌ని కలిసి నియోజకవర్గ యువత కోసం క్రీడా మైదానాల (స్టేడియం) ఏర్పాటు, క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, మైనారిటీ సంక్షేమ నిధులపై చర్చించారు. అనంతరం హైదరాబాద్‌లోని తెలంగాణ సెక్రటేరియట్ నందు అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన అనారోగ్య బాధితుల నుంచి స్వీకరించిన ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులను ఆ విభాగంలో సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే అందజేశారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్న తరుణంలో ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయంతో పాటు నిమ్స్ ఆసుపత్రిలో విలువైన వైద్యం ఉచితంగా అందిస్తున్నట్టు పేర్కొన్నారు ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యత అని తెలిపారు.





## చేన్నంగలగడ్డ-మాదారం కాలవకు కల్వర్టు ఏర్పాటు చేయాలి:రైతుల విజ్ఞప్తి

*కారేపల్లి జూన్ 11 ప్రభాతవార్త*

సింగరేణి మండలం మాదారం పెద్ద చెరువుకు వరద నీరు సరఫరా జరిగే కాలవ తో గత రెండు సంవత్సరాలుగా రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాలవపై వరద నీరు పొంగిపోకుండా కల్వర్టు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రధానంగా కాలవపై కల్వర్టు



లేకపోవడంతో వరద నీరు రహదారిని దాటి రైతుల పొలాల మీదుగా ప్రవహిస్తూ పంటలకు నష్టం కలిగిస్తుందని దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా సాగు పనులు కూడా ఇబ్బందికరంగా మారుతున్నాయని రైతులు అంటున్నారు.ఈ సమస్యపై గతంలో 0807 2025న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు వినతిపత్రం అందజేసినట్లు రైతులు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు నేను శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం రైతుల సమస్యలను అర్థం చేసుకొని స్పందించాలని, ప్రస్తుత సంవత్సరంలోనే కాలవకు మోరి నిర్మించి వరద నీరు రహదారిపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మోరి నిర్మాణం జరిగితే పొలాలకు నష్టం తగ్గడంతో పాటు రహదారి రాకపోకలు కూడా సులభతరం అవుతాయని రైతులు పేర్కొన్నారు.రైతుల కష్టాలను గుర్తించి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాలవకు కల్వర్టు నిర్మాణ పనులను చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమి తి

### ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థు లకు ఉత్తమ

### ప్రతిభా పురస్కారం అం దజేత

*కామేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:*

అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో తాంద్ర రాంప్రసాద్ గురుస్వామి సారథ్యంలో పదవ తరగతి 2025 26వ వార్షిక సంవత్సరానికి గాను ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాలో ప్ర భుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివిన వి ద్యార్థిని విద్యార్థులకు గురువారం ఉత్త మ ప్రతిభా పురస్కారం ను అందజేశారు. కామేపల్లి ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్ర తిభ కనబరిచిన మొదటి,రెండవ స్థానా లు వచ్చిన తంబ శ్రీనుచిత్ర కుమార్తె ధ రణి,వెన్ను రవిరాధ కుమార్తె అనూషల కు తాంద్ర.రాంప్రసాద్ గురుస్వామి



షీల్డ్ బహుకరించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జా తీయ అధ్యక్షులు ఆర్ఆర్ దేశ్ పాండే, తాంద్ర రాంప్రసాద్ గురుస్వామి,తంగిళ్ళ పల్లి తిరుపయ్య గురుస్వామి,కన్నమాల రాంబాబు గురుస్వామి, గట్ల వెంకన్న గు రుస్వామి,కన్నమాల వెంకటేశ్వర్లు గురు స్వామి,భాగం రామారావు గురుస్వామి, కామ వెంకటేశ్వర్లు గురుస్వామి,దుంపటి ఉపేందర్, గుగ్గిల రవి,అమరబోయిన తి రుపతయ్య పాల్గొని విద్యార్థిని విద్యార్థు లను అభినందించారు.

## దివ్యాంగుల కుటుంబానికి చేయూతనందించిన వైరా పట్టణ పోలీసులు

*వైరా టౌన్ జూన్ 11 (ప్రభాతవార్త)*

వైరా మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన మోదుగు జయలక్ష్మి ్మ(47) పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతుండగా ఆమె చెల్లెలు మోదుగు కృపావతి (40) మోదుగు యేసుమణి (36) కూడా మానసిక దివ్యాంగులు. వీరిద్దరి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వీరి పోషణ భారం కూడా పోలియోతో బాధపడుతున్న దివ్యాంగురాలు అయిన జయలక్ష్మి ్మ పై భారం పడింది. తల్లిదండ్రులు చనిపోవడంతో తన ఇద్దరు మానసిక దివ్యాంగులైన చెల్లెలు ఆలనా పాలన జయలక్ష్మి ్మ



చూసుకుంటుంది. వీరికి దివ్యాంగుల పెన్షన్ వస్తున్నప్పటికీ వైద్యము ఇతరత్రా అవసరాలకు ఇబ్బందులు పడటంతో కొంతవరకు కుటుంబానికి దిక్కైన జయలక్ష్మి ్మ టైలరింగ్ తో తన ఇద్దరు సోదరీమలతో కలిసి కుటుంబ భారాన్ని నెట్టు కుంటూ వస్తుండగా ఇటీవల కాలంలో టైలరింగ్ చేయడం కూడా ఇబ్బందికరంగా మారింది. తమ కుటుంబం యొక్క దయనీయమైన పరిస్థితిని చూసి దాతలు ఎవరైనా ఆదుకోవాలని ఉపాధి కల్పించాలని ఇటీవల పత్రికా ముఖంగా తెలియజేయడంతో ఇట్టి విషయం వైరా పట్టణ ఎస్ఐ పుష్పాల రామారావు దృష్టికి రావడంతో, దివ్యాంగులైనటువంటి ఈ కుటుంబానికి ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో తన మిత్రుడు ప్రవాస భారతీయుడు కెనడా వాసి అయిన ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన నెమలి పూరి సీతారామారావు ఆర్థిక సహకారంతో వీరికి ఫ్లోర్ మిల్లు( పిండి మిల్లు )కొనుగోలు చేసి వారికి తాత్కాలిక జీవనోపాధి కోసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైరా పట్టణ ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ పాలడుగు గ్రామంలో ఎటువంటి పిండి మిల్లు లేకపోవడంతో తన ఇంటి వద్దనే ఉండి జీవనోపాధి పొందెందుకు వీలుగా ఆమె అభీష్టం మేరకు పిండి మిల్లును అందించామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మోదుగు జయలక్ష్మి ్మ సోదరీమణులు ఎన్ఆర్ఐ సీతారామారావు కు మరియు వైరా పట్టణ ఎస్సై పుష్పాల రామారావు కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా వజినేపల్లి చక్రవర్తి నియామకం

### పత్రాన్ని అందించిన అమరవాది లక్ష్మీనారాయణ

*వైరా టౌన్ జూన్ 11 (ప్రభాతవార్త)*

వైరా మున్సిపాలిటీ ఐదో వార్డ్ కి చెందిన వజనేపల్లి చక్రవర్తి (చక్రధర్ రావు) నీ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని గురువారం హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్షి ్మనారాయణ ,తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, నూకల వాసుతో కలిసి వజినేనపల్లి చక్రవర్తికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వజినేపల్లి చక్రవర్తి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధి లో భాగస్వామ్యం అయ్యేందుకు బాధ్యతలు ఇచ్చిన ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరావథి లక్షి ్మనారాయణ, వనమా విశ్వేశ్వరరావు, నూకల వాసుతోపాటు ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వజినేపల్లి చక్రవర్తి వనమా విశ్వేశ్వరరావు కు అత్యంత సన్నిహితుడుగా ఉంటూ ఆర్యవైశ్యుల సహకారం అందించడంలో తన వంతు బాధ్యత నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. చక్రవర్తి నియామకం పట్ల హర్షం. వైరా కి చెందిన జినేపల్లి చక్రవర్తి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా నియామకం కావడం పట్ల వైరాలోని మిట్టపల్లి సత్యంబాబు, నూకల ప్రసాద్, మిట్టపల్లి కిరణ్, సందీప్, యండ్రపుడి శంకర్ ,మిట్టపల్లి విజయ్, కొల్లా రాంబాబు తో పాటు పలువురు ఆర్యవైశ్య మరియు ఇతరులు వర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.






## వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోండిడాక్టర్ శ్రీదేవి

*కామేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త:*

వర్షకాలం లో కీటకాల నుండి కలుషితం అయిన నీటి వల్ల సంక్రమించే వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలనిడాక్టర్ శ్రీదేవి కోరారు.కామేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశం లో ఆమె మాట్లాడారు.అందుకు



గాను తీసుకువాల్సిన జాగ్రత్తలు ఆశా కార్యకర్తలు,వైద్య సిబ్బందికి వివరించారు.కుటుంబ నియంత్రణ పద్ధతులు,బిడ్డ కి బిడ్డ కి దూరం కోసం పాటించవాల్సిన పద్ధతులను వివరించడం జరిగింది.డైయేరియా నివా రణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 16 నుండి 30 వరకు 05 వయస్సు పిల్లలకు విరోచనాలు అయితే జింక్ టాబ్లెట్ ఓ ఆ ర్ ఎస్ పాకెట్స్ ఇచ్చేలా ఇంటింటి సర్వే జ రుగుతుందని తెలిపారు.పల్స్ పోలియో కార్యక్రమం ఈనెల 28న ప్రారంభమవుతుందని దానికి కావాల్సిన 05 సవంత్సరాల పిల్లల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.జాతీయ కార్యక్రమాలు అన్ని ఆన్లైన్ లో అప్డేట్ అయ్యేలా చేయాలని కోరారు.ఈ సమావేశంలో డాక్టర్ హారిక, డాక్టర్ రంజిత్ కుమార్, హెచ్ ఈ ఓ కె. వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు నాణ్యమైన విద్య

### తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

### పోలంపల్లి సర్పంచ్ హేమలత కాంగ్రెస్ నాయకులు బద్రు నాయక్

*కారేపల్లి జూన్ 11 ప్రభాతవార్త*

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందిస్తుందని పోలంపల్లి గ్రామ సర్పంచ్ ధారావత్ హేమలత కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ ధారావత్ బద్రు నాయకులు అన్నారు. సింగరేణి మండలం పోలంపల్లి గ్రామపంచాయతీలో గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అధ్యాపకులు గ్రామస్తులచే నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొని ఇంటింటికి తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల మధ్య వ్యత్యాసము ఫీజులు ఇతర విషయాలపై తల్లిదండ్రులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం కోసం మధ్యాహ్నం భోజనం తో పాటు విద్యార్థులకు ఉపయోగపడే 21 రకాల వస్తువుల కిట్టును ఉచితంగా అందజేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత గల ఉపాధ్యాయులచే బోధించడంతోపాటు క్రీడలను ప్రోత్సహిస్తూ జాతీయస్థాయిలో విద్యార్థులు ప్రతిభను కనబరిచే విధంగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో జూన్ నెల స్కూల్ ఓపెనింగ్ నుండి విద్యార్థులకు అల్పాహార పథకము, అమలు చేస్తుందన్నారు ప్రవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు ఉపాధ్యాయులు శ్రీనివాస్వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మండల స్థాయి ముగ్గుల పోటీలు

సైదాపూర్, ప్రభాత వార్త:

సంతోషిమాత మండల సమాఖ్య వె-సైదాపూర్ మండల స్థాయి ముగ్గుల పోటీలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా మహిళలకు మంత్రి రాష్ట్ర



రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి పొన్నం మంజుల గురువారం ఈ బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సంఘం పర్సన్ ఇంచార్జ్ కొత్త తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ రాజ్ కుమార్, స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎంపిడివో యాదగిరి, ఏపిఎం తిరుపతి, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు, అన్ని గ్రామాల సర్పంచులు, సిసిలు, వివోఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ కు మాతృవియోగం

సైదాపూర్, ప్రభాత వార్త:

సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్, పర్సన్ ఇంచార్జ్ డైరెక్టర్ గుండేటి శ్రీనివాస్ తల్లి గుండేటి వనిత మాజీ ఎంపిటిసి సభ్యులు అత్త గారైన గుండేటి కనుకమ్మ (70) అనే వృద్ధురాలు బుధవారం అర్ధరాత్రి తన స్వగృహం ఎక్లాస్పూర్



గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి భర్త మొగిలి ఐదు సంవత్సరాల క్రితం చనిపోయారు. మృతురాలికి ఒక్క కూతురు, ఇద్దరు కుమారులు, మనుమలు, మనుమరాలులు ఉన్నారు. మృతురాలు కనుకమ్మ మృతదేహానికి పిఏసిఎస్ పర్సన్ ఇంచార్జ్ బిల్ల వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెన్నంపల్లి పిఏసిఎస్ పర్సన్ ఇంచార్జ్ బిల్ల వెంకటరెడ్డి, వెన్కెపల్లి సైదాపూర్ పర్సన్ ఇంచార్జ్ కొత్త తిరుపతి రెడ్డి లతో పాటు మాజీ సర్పంచులు కొత్త రాజిరెడ్డి, పైడిమల్ల సుశీల తిరుపతి, మాజీ పిఏసిఎస్ పర్సన్ ఇంచార్జ్ సొరబుడ్ల రాజిరెడ్డి, సంఘం సిఈవో చెల్మల్ల మల్లారెడ్డి, మొల్గూరి సంపత్, దొనపాటి రాంరెడ్డి, ఆరెపల్లి ఉప సర్పంచ్ వెంగల రవి, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సిబిఎఫ్‌సి సభ్యుడిగా సబ్బని రమేష్ నియామకం

**-- నియామక పత్రం అందజేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) సభ్యుడిగా బిజెపి నాయకుడు సబ్బని రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సిబిఎఫ్‌సి రీజనల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ గౌలికర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేయగా, గురువారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా రమేష్ తన నియామక పత్రాన్ని అందుకున్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం చురుకుగా పనిచేసే రమేష్‌కు కేంద్ర స్థాయిలో కీలక పదవి దక్కడం పట్ల స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ నియామకంతో హుజూరాబాద్‌కు తగిన గౌరవం దక్కిందని వారు కొనియాడారు. ఈ సందర్భంగా సబ్బని రమేష్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు జిల్లా పార్టీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, సంస్థ ప్రతిష్టను మరింత పెంచుతానని ఆయన స్పష్టం చేశారు.





# నేడు జమ్మికుంటకు.. ట్రబుల్ షూటర్ హరీష్‌రావు రాక..

## బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదుకు ఎమ్మెల్యే పిలుపు..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:

రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ నూతనంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం జమ్మికుంట ఎంపిఆర్ గార్డెన్‌లో చేపట్టబోతున్న సభ్యత్వ నమోదు



కార్యక్రమానికి హుజురాబాద్ నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ మండలాల నుండి అధిక సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీ ప్రథమ, ద్వితీయ శ్రేణి నాయకులతో పాటు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి, ట్రబుల్ షూటర్‌గా పేరు తెచ్చుకున్న తన్నీరు హరీష్‌రావు, రాష్ట్ర మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర టెక్నికల్ కార్పోరేషన్ చైర్మన్ చిరుమల్ల రాజేష్‌లు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభ్యత్వ కార్యక్రమం నమోదు చేపట్టడం జరుగుతుందన్నారు. దీనితో పాటు (ఎస్ఐఆర్) ఓటర్ నమోదు ప్రక్రియపై ప్రత్యేక సూచనలు, పర్యవేక్షణ ప్రతి కార్యకర్త తెలుసుకోవల్సిన అంశాలపై సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విధిగా ప్రతి బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుడు, సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు, సింగిల్ విండో అధ్యక్షులు, కుల సంఘాల నాయకులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఘనంగా సన్మానించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి మున్సిపల్ ఎన్నికల అనంతరం రైతుల ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను గురువారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ (దిలీప్), బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు చంద రాజు, కొలకాని రాజకుమారి, శీలం శ్రీనివాస్, బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. తాము ప్రజల ఆశీస్సులతో మొదటిసారిగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నిక కావడం జరిగిందని, జమ్మికుంట పట్టణ అభివృద్ధికి కేంద్ర మంత్రిగా, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా సంపూర్ణ సహకారం అందించి అభివృద్ధికి తోడ్పాడాలని మున్సిపల్ చైర్మన్ దిలీప్ కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసారు. జమ్మికుంట పట్టణ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను ఆధునిక మోడల్ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దడంతో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బండ్లను జమ్మికుంటలో హాల్టింగ్‌కు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జమ్మికుంట పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి తన వంతు సహకారం ఉంటుందని మంత్రి బండి సంజయ్ హామీ ఇవ్వడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.






# ప్రత్యేక ఓటర్ల సవరణపై ప్రజా ప్రతినిధులు, బిఎల్ఓలతో సమీక్ష....

**సత్తుపల్లి జూన్ 11 (ప్రభాతవార్త):** భారత ఎన్నికల సంఘం తరపున



నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ( ఎస్ ఐ ఆర్) కు సంబంధించి ప్రజా ప్రతినిధులు, బి ఎల్ ఓ ల తో మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం తాసిల్దార్ పున్నం సత్యనారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. తప్పులు లేని ఓటర్ జాబితా తయారు చేయటం ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలు అనేక మార్పులు చోటు చేసుకున్నాయి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం ఓటర్ లు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాల్లో నమోదు కావడం మరణించిన ఓటర్ల పేర్లు తొలగించకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. అట్టి పేర్లు సుమోటాగా తొలగించ వీలు లేకపోవడం ఇట్టి ఎస్ ఐ ఆర్ లో భాగంగా తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడం అనే ముఖ్య ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం మే 14, 2026న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకటించింది. దీనిలో భాగంగా రాష్ట్రంలో ఈ ఓటర్ల సవరణ ప్రక్రియ కొనసాగుతుందని తాసిల్దార్ సమావేశంలో వివరించారు. ఓటర్ల సవరణ ప్రక్రియ ఈ విధంగా సాగుతుంది. ఇంటింటా ఓటర్ గణన ఫామ్ ల పంపిణీ జూన్ 25 నుంచి జులై 24 వరకు, ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ జులై 31, అభ్యంతరాలు క్లైమూలా దాఖలు కాల పరిమితి, జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు, నోటీసులు జారీ విచారణ అభ్యంతరాల పరిష్కారం జూలై 31 నుండి, సెప్టెంబర్ 28 వరకు, తుది ఓటర్ల జాబితా ప్రసురుణ అక్టోబర్ 1 2026 న ప్రసరించడం జరుగుతుందని తాసిల్దార్ సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, కౌన్సిలర్స్ మట్ట ప్రసాదు, తోట సుజలా రాణి, గ్రాండ్ మోలాలి, విరివాడ అపర్ణ నాగభూషణం, షరీఫ్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ కమల్ పాషా, పింగళి శామ్యూల్, అధికారులు పాల్గొన్నారు.

# గ్యాస్ పెట్రోల్ డీజిల్ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుదలపై గర్జించిన సిపిఐ...

**- ధరలు తగ్గే వరకు పోరాటం చేస్తాం...**

**- సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు ఎస్కె.రంజాన్ బి..**

వేంసూర్,జూన్ 11,ప్రభాతవార్త:

మోడీ ప్రభుత్వం రోజురోజుకు పెంచుతున్న వంట గ్యాస్,డీజిల్ పెట్రోల్ ధరలతో పాటు నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు,ప్రజలు,పెద్ద సంఖ్యలో పాల్గొని ధరలపై ప్రభుత్వాన్ని గర్జించడం జరిగిందని,ధరలు తగ్గే వరకు పోరాటం ఆగదని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్.రంజాన్ బి అన్నారు.బుధవారం రోజు ఖమ్మంలో కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ఆందోళనలో,వేంసూరు మండలం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమానికి హాజరయ్యారని,ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ ఎల్లప్పుడూ పోరాడుతుందని,పెన్షన్ 4000 పెంచాలని వికలాంగులకు 6000 ఇవ్వాలని,మహాలక్ష్మి పథకం 2500 తేవాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేంసూరు మండల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



